

## వాల్తేరు డీఆర్‌ఎంగా లలిత్ బొహ్రా బాధ్యతల స్వీకారం


బాధ్యతలు స్వీకరిస్తున్న లలిత్ బొహ్రా

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం)గా లలిత్ బొహ్రా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ గత ఏడాది నవంబరు 17న ఢిల్లీలో ఒక కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కొత్త వారిని నియమించకుండా అదనపు డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూకు బాధ్యతలు అప్పగించారు. ఇటీవలె లలిత్ బొహ్రాను నియమిస్తున్నట్టు ప్రకటించారు. ఆయన సోమవారం వచ్చి విధుల్లో చేరారు. ఇక్కడికి వచ్చే ముందు ఆయన రెన్యువబుల్ ఎనర్జీ విభాగంలో జాయింట్ సెక్రటరీ హోదాలో పనిచేశారు. కేంద్రం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్, ముఫ్త్ బిజల్ యోజన, పీఎం-కుసుమ్, విండ్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ కారిడార్స్ వంటి అంశాల్లో కీలకంగా వ్యవహరించారు. ఐఆర్‌టీఎస్ 1998 బ్యాచ్‌కు చెందిన లలిత్ బొహ్రా రైల్వేలో చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా, చీఫ్ పాసింజర్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్‌గా, చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా, డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా, కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించారు. బొహ్రా ముంబై ఐఐటీలో బీటెక్ (ఎలక్ట్రికల్), బిట్స్ పిలానీలో ఎంబీఏ చేశారు.

## విధులు వదిలేసి..! రోడ్డుకు అడ్డంగా కాసి..!!

నగరంలో ట్రాఫిక్ పోలీసుల ఓవరాక్షన్

పెండింగ్ చలానాల తనిఖీ పేరుతో ఎక్కడికక్కడ వాహనాల అడ్డగింపు

- ఎవరైనా ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం
- ఉద్యోగాలకు, అత్యవసర పనులపై వెళ్లేవారికి ఇబ్బందులు
- పోలీసుల తీరును తప్పుపడుతున్న వాహన చోదకులు
- ఈ సమస్యపై కమిషనర్ దృష్టి పెట్టాలని విజ్ఞప్తి


అక్కయ్యపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద వాహనదారులను అడ్డుకుంటున్న పోలీసులు




మద్దిలపాలెం వద్ద వాహనదారుడిని ఆపి పెండింగ్ చలానాలు పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ పోలీసుల వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిని ఆపి కేసులు నమోదు చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ, అందరినీ అడ్డుకుంటున్నారు. ఈ-చలాన్లు పెండింగ్ ఏమైనా ఉన్నాయేమో తనిఖీ చేసి పంపిస్తామంటూ మండుటెండలో నిలబెట్టేస్తున్నారు. తమ వాహనంపై పెండింగ్ చలాన్‌లు లేవని, తాము విధులకు ఆలస్యమైతే ఇబ్బందిపడాల్సి వస్తుందని ప్రైవేటు సంస్థలు, దుకాణాల్లో పనిచేసేవారు చెబుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. పైగా మరింతసేపు నిరీక్షించేలా వ్యవహరిస్తున్నారు. పోలీసుల వ్యవహారశైలితో ఆస్పత్రులకు, రైల్వే స్టేషన్‌కు వెళ్లేవారు చాలా ఇబ్బందిపడాల్సి వస్తోంది.

గతంలో పోలీసులు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద, పార్కింగ్ స్థలాల్లోనూ సెల్‌ఫోన్ పట్టుకుని ప్రత్యేక యాప్‌లో ఒక్కో వాహనం నంబర్‌ను ఎంటర్ చేసి పెండింగ్ చలాన్‌లు ఉన్నాయా? లేవా? అనేది పరిశీలించేవారు. ఎవరికైనా పెండింగ్ చలాన్‌లు ఉన్నట్టు గుర్తిస్తే ఆ వాహనాన్ని పక్కకు తీసుకురావాలని వాహన చోదకుడికి చెప్పేవారు. పెండింగ్ చలాన్‌లను క్లియర్ చేసుకోవాలని ఆదేశించేవారు. అందుకు ఎవరూ అభ్యంతరం చెప్పేవారు కాదు. కానీ ఇప్పుడు పంథా మార్చారు. వాహనాలు రోడ్డుపై వేగంగా వెళుతుంటే హఠాత్తుగా అడ్డంగా వచ్చి ఆపాలంటూ చేతులు అడ్డంగా పెడుతున్నారు. దీని వల్ల వాహన చోదకులు కంగారు పడుతున్నారు. తమను ఎందుకు ఆపారని ఎవరైనా పోలీస్ సిబ్బందిని అడిగితే...'ముందు బండి పక్కన పెట్టండి, తరువాత చెబుతాం' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. ఏం జరిగిందోనని ఆందోళనతో వాహనాన్ని పక్కకు తీస్తే... పెండింగ్ చాలాన్‌లు ఏమైనా ఉన్నాయా? అని అడుగుతూనే సెల్‌ఫోన్‌లో

... మిగతా 6వ పేజీలో

## మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధి



భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యేలోగా జాతీయ రహదారికి అనుసంధానంగా ఉండే రోడ్ల పునర్నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ ప్రణాళిక

- కొత్తవలస-దొరతోట-తాళ్లవలస రోడ్డుకు ప్రతిపాదనలు
- 3.83 కి.మీ. పొడవు... 80 అడుగుల వెడల్పు
- అభ్యంతరాలు తెలిపేందుకు వారం రోజులు గడువు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణంపై దృష్టిసారించింది. వచ్చే ఏడాది జూన్‌లో భోగాపురం విమానాశ్రయం ప్రారంభం కానున్న నేపథ్యంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేయాలని భావిస్తోంది.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి భోగాపురం విమానాశ్రయం వైపు వెళ్లే వాహనాలు నగరంలోకి వచ్చి ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకోకుండా ఇతర మార్గాల్లో అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారికి చేరుకునేలా మాస్టర్ ప్లాన్ రహదారులను సిద్ధం చేస్తోంది. ఈ విధంగా మొత్తం 15 రహదారులను పునర్నిర్మాణం చేయాలని ఇప్పటికే నిర్ణయించింది. పినగాడి నుంచి శొంఠ్యాం మీదుగా ఒక రహదారి అభివృద్ధికి నాలుగు నెలల క్రితం ప్రకటన వెలువరించారు. ఆ రహదారిని 40 అడుగుల నుంచి 150 అడుగులకు విస్తరించాలని ప్రతిపాదించారు. దీనిపై పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆ ప్రణాళికతోనే పనులు చేపడితే ఆ మార్గంలో రాంపురం, లక్ష్మీపురం తదితర గ్రామాలు పూర్తిగా కనుమరుగవుతాయని స్థానిక ప్రజలు, ఆ ప్రాంత నేతలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దాంతో పునరాలోచనలో పడ్డారు. ఇప్పట్లో అటు వైపు అంత వెడల్పు మార్గం అవసరం లేదని, మరో ప్రణాళిక సిద్ధం చేయాలని భావిస్తున్నారు. ఇదిలావుండగా భీమిలి మండలం కొత్తవలస నుంచి దొరతోట మీదుగా జాతీయ రహదారిపై తాళ్లవలసను కలుపుతూ మాస్టర్ ప్లాన్ రహదారిని అభివృద్ధి చేస్తామని కొద్దిరోజుల క్రితం ప్రకటించారు. ఈ మార్గాన్ని 80 అడుగుల వెడల్పుతో 3.83 కి.మీ. పొడవున పునర్నిర్మాణం చేస్తామని పేర్కొన్నారు. ఇది కొత్తవలసలో అంటే శారదా పీఠానికి వైసీపీ ప్రభుత్వం 15 ఎకరాలు కేటాయించిన ప్రాంతం నుంచి దొరతోట మీదుగా వెళుతుంది. కొత్తవలసలో సర్వే నంబర్లు 62/పి, 65/పి, 73/పి, 87/పి, 88/పి, 90/పి, నేరళ్లవలస గ్రామంలో సర్వే నంబరు 8/పి, తాళ్లవలస గ్రామంలో 161/పి, 162/పి, 163/పి, 164/పి, 156/పి, 189/పి, 190/పి, 191/పి, 197/పి, 192/పి, 198/పి, 214/పి, 215/పి, 216/పి, 217/పి గల భూముల మీదుగా వెళ్లి తాళ్లవలస సర్వే నంబరు 61 వద్ద జాతీయ రహదారిని కలుస్తుంది. ఈ రహదారి ఎక్కువగా ప్రభుత్వ భూముల మీదుగానే ప్రతిపాదించినట్టు వీఎంఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ఈ మార్గం అభివృద్ధిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నట్టయితే వారం రోజుల్లో తెలపాలని అధికారులు పేర్కొన్నారు.


కొత్తవలసలో శారదాపీఠం వద్ద మొదలయ్యే మాస్టర్ ప్లాన్ రహదారి ఇదే

## పల్సస్ ఉద్యోగుల ఆందోళన

- నాలుగు నెలల జీతాలు పెండింగ్
- అడిగితే ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారని ఆరోపణ
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన
- యాజమాన్యం పట్టించుకోకపోవడంతో ఆందోళనను ఉధృతం చేసేందుకు సన్నద్ధం



జీతాలు అందక సంస్థ గేట్ వద్ద ఆందోళన చేపట్టిన పల్సస్ ఉద్యోగులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రుషికొండ ఐటీ పార్కులో హిల్ నంబర్ 2పై గల 'పల్సస్' హెల్త్ టెక్ కంపెనీ ఉద్యోగులు జీతాల కోసం సోమవారం ప్రధాన ద్వారం ఎదుట ఆందోళనకు దిగారు. నాలుగు నెలల జీతం తక్షణం చెల్లించాలని, పీఎఫ్ విత్‌డ్రా చేసుకునేలా అవకాశం ఇవ్వాలని, ఉద్యోగుల పట్ల యాజమాన్యం వ్యవహరిస్తున్న నిరంకుశత్వ వైఖరి విడనాడాలని, శ్రమకు తగ్గ వేతనం చెల్లించాలని ఈ సందర్భంగా ఉద్యోగులు నినాదాలు చేశారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని, మానసికంగా ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. జీతాల గురించి అడిగితే మరుసటిరోజు ఉద్వాసన పలుకుతున్నారన్నారు. ఆ కారణంతోనే ఇటీవల చాలామందిని హైదరాబాద్ యూనిట్‌కు బదిలీ చేశారన్నారు. తమకు జీతం చెల్లించపోగా, తిరిగి

... మిగతా 6వ పేజీలో

### జీతాలు ఇవ్వరు.. అడిగితే తొలగిస్తామంటారు

- నారా సంతోష్(ఉద్యోగి)



గత ఏడాది నవంబరు నుంచి జీతాలు అందాల్సి ఉంది. జీతం అడిగితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారు. మూడేళ్లుగా పనిచేస్తున్నా. ఇక్కడ ఉద్యోగుల పరిస్థితి చాలా ఘోరంగా ఉంది. కంపెనీ నిర్వహణలో లోపాలు ఉద్యోగుల పాలిట శాపాలుగా మారాయి.

### జీతాలు ఇవ్వకపోగా ఇబ్బందిపెడుతున్నారు

- పి.వరప్రసాద్



నెలనెలా సక్రమంగా జీతాలు చెల్లించకపోగా అడిగితే ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఏయూలో ఎంఎస్‌సి చదివాను. క్యాంపస్‌కు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించడంతో మంచి కంపెనీ అనుకుని చేరాను. కానీ ఇక్కడ పరిస్థితి వేరుగా ఉంది. జనవరి నెలలో కేవలం 1,300 అకౌంట్‌లో వేశారు. అదేమిటని అడిగితే సరైన సమాధానం రావడం లేదు. పీఎఫ్ అకౌంట్ క్రియేట్ చేస్తామన్నారు. ఆ తరువాత అందరి పీఎఫ్ అకౌంట్ బ్లాక్ చేసేశారు.

## హోరాహోరీగా ఎమ్మెల్సీ పోరు

ముగ్గురి మధ్య ప్రధాన పోటీ

- రఘువర్మకు కొన్ని ఉపాధ్యాయ సంఘాలు, టీడీపీ, జనసేన మద్దతు
- గాదె శ్రీనివాసులునాయుడు, కోరెడ్ల విజయగౌరిలకు మరికొన్ని సంఘాల సంఘీభావం
- నేటి సాయంత్రంతో ముగియనున్న ప్రచారం
- 27న పోలింగ్


పాకలపాటి రఘువర్మ


గాదె శ్రీనివాసులు నాయుడు


కోరెడ్ల విజయగౌరి

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం హోరా హోరీగా సాగుతోంది. బరిలో పది మంది అభ్యర్థులు ఉండగా ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. సుంకరి శ్రీనివాసరావు అనే అభ్యర్థి పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు ఐదారు రోజుల క్రితం ప్రకటించారు. ఆయన రఘువర్మకు మద్దతు పలికారు. కాగా సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు మద్దతుగా కొన్ని ఉపాధ్యాయ సంఘాలతోపాటు టీడీపీ, జనసేనలు ప్రచారం చేస్తున్నాయి. గతంలో ఎప్పుడూ రాజకీయ పార్టీలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ప్రకటించడం గానీ, నేరగా ప్రచారం చేయడం గానీ జరగలేదు. అయితే రఘువర్మ కొంత తెలుగుదేశం పార్టీకి సన్నిహి తంగా ఉండేవారు. ఈ నేపథ్యంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల పరిధిలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులంతా ఉపాధ్యాయ ఓటర్లను కలిసి రఘువర్మకు మద్దతు కోరుతున్నారు. ఇందుకోసం ప్రతి నియోజకవర్గానికి టీడీపీ పరిశీలకులను కూడా నియమించింది. మరో అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడుకు కొన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఆర్‌ఎస్‌ఎస్‌తో అనుబంధం ఉన్న ఒక ఉపాధ్యాయ సంఘం శ్రీనివాసులనాయుడుకు మద్దతు ప్రకటించడంతో ఆయన తరఫున బీజేపీ నాయకుడు పీవీఎన్ మాధవ్ ప్రచారం చేస్తున్నారు. ఇంకో అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి తరఫున కొన్ని ఉపాధ్యాయ సంఘాలు, వామపక్ష పార్టీలు ప్రచారం నిర్వహిస్తున్నాయి.

ఆరు జిల్లాల పరిధిలో 22,493 మంది ఓటర్లు ఉన్నారు. ఈనెల 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనున్నది. పోలింగ్ ముగిసే సమయానికి

... మిగతా 6వ పేజీలో

## అధికార అండతో అక్రమ నిర్మాణం!

- గాజువాకలో నిబంధనలు అతిక్రమించి బహుళ అంతస్థుల భవనం నిర్మాణం
- ప్రజా ప్రతినిధి సోదరి కావడంతో కన్నెత్తి చూడని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు


గాజువాక పంతులుగారి మేడ వద్ద నిబంధనలు అతిక్రమించి నిర్మిస్తున్న భారీ భవనం

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు తలదాచుకునేందుకు ఎక్కడైనా చిన్న షెడ్డు నిర్మించుకుంటే నిర్దాక్షణ్యంగా కూల్చివేసే జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు నిబంధనలు అతిక్రమించి అడ్డగోలుగా నిర్మించే భారీ భవంతుల జోలికి మాత్రం వెళ్లరు. గాజువాక ప్రాంతంలో ప్రజా ప్రతినిధి సోదరి, మాజీ కౌన్సిలర్ నిబంధనలకు

... మిగతా 6వ పేజీలో

## రవాణా, ట్రాఫిక్ వ్యవస్థల మెరుగుకు ఉమ్టా

వీఎంఆర్‌డీఏ పరిధిలో యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ఏర్పాటు

- ప్రభుత్వం ఉత్తర్వులు
- సభ్యులుగా ఆర్టీసీ ఎండీ, రవాణా శాఖ కమిషనర్, మూడు జిల్లాల కలెక్టర్లు, వీఎంఆర్‌డీఏ కమిషనర్, వాల్తేరు డీఆర్‌ఎం, సిటీ పోలీస్ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) పరిధిలో ట్రాఫిక్, రవాణా వ్యవస్థలను ఏకతాటిపైకి వచ్చి సమస్యలను ఉమ్మడిగా పరిష్కరించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఉమ్టా) పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

వీఎంఆర్‌డీఏ 6,501.65 చ.కి.మీ. పరిధిలో విస్తరించి ఉంది. విశాఖ జిల్లాలో రైలు, రోడ్డు, విమాన, జల రవాణా వ్యవస్థలు ఉన్నాయి. నగరం విస్తరిస్తోంది. వాహనాలు పెరుగుతున్నాయి. దాంతో పాటు ప్రమాదాలు అధికమవుతున్నాయి. ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. దీని పరిష్కారానికి పోలీస్ యంత్రాంగం పనిచేస్తోంది. పాలనాపరంగా రహదారుల విస్తరణ పనులను జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ చూసుకుంటున్నాయి. నగరం మధ్య నుంచి జాతీయ రహదారి వెళుతోంది. భారీ సరకు రవాణా వాహనాల ప్రయాణం వల్ల హైవే రద్దీగా ఉంటోంది. ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అవుతోంది. కొత్త అంతర్జాతీయ విమానాశ్రయాన్ని భోగాపురంలో నిర్మిస్తున్నారు. విశాఖ నుంచి 45 కి.మీ. జాతీయ రహదారిపై ప్రయాణిస్తే

... మిగతా 6వ పేజీలో



స్వర్ణ తులసీ దళాలతో సింహాచలేశుడు

## సింహాచలేశునికి స్వర్ణ తులసీ దళార్చన

సింహాచలం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామికి స్వర్ణ తులసీ దళార్చనను వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా ప్రతినెలా ఏకాదశి రోజుల్లో స్వర్ణ తులసీ దళార్చన చేస్తారు. ఇందులో భాగంగా సోమవారం వేకువజామున స్వామివారికి ప్రభాత ఆరాధనలను యథావిధిగా పూర్తి చేశాక స్వర్ణ తులసీ దళాలతో బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలాదేవీల సమేతంగా ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి నారసింహ అష్టోత్తర శతనామావళిని (108) పఠిస్తూ స్వర్ణ తులసీ దళాలతో అర్చన జరిపారు. అనంతరం భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా సింహాచలేశుని నిత్య కల్యాణాన్ని పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిర్వహించారు.

## జాతీయ స్థాయి త్రోబాల్ విజేతకు అభినందనలు



విద్యార్థిని జననిని అభినందిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో తృతీయ స్థానాన్ని సాధించి జాతీయ పోటీలకు ఎంపికైన బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థిని సుంకరి జననిని సోమవారం అవంతి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు. కాగా మంగళవారం అవంతి ఫార్మసీ కళాశాలలో ఎపోటెక్ పేరుతో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్టు కళాశాల చైర్మన్ తెలిపారు.

## టెన్నీస్‌ల్లో తృతీయ బహుమతి



విజేతలకు అభినందిస్తున్న కస్తూర్బా విద్యాలయ ప్రిన్సిపాల్ కుమారి

భీమునిపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భీమిలి గొల్లలపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు రాష్ట్ర స్థాయి టెన్నీస్ బాల్ పోటీల్లో తృతీయ స్థానంలో గెలుపొందినట్టు ప్రిన్సిపాల్ జి.కుమారి తెలిపారు. 12వ సీనియర్ ఏపీ టెన్నీస్ బాల్ క్రికెట్ ఛాంపియన్ షిప్- 2025 పోటీలు ఈనెల 21 నుంచి 23 వరకూ తిరుపతిలో జరిగాయన్నారు. ఈ పోటీల లో తమ విద్యాలయానికి చెందిన 14 మంది విద్యార్థినులు పాల్గొని తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. విజేతలైన విద్యార్థినులను, తర్ఫీదు నిచ్చిన పీఈటీ వరలక్ష్మిని ఆమె అభినందించారు.

## గీతంను సందర్శించిన యూఎన్‌సీడబ్ల్యూ బృందం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ క్యారోలైనా విల్మింగ్టన్ ప్రతినిధి బృందం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సోమవారం సందర్శించింది. బోధన, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలను చర్చించారు. ఈ బృందంలో యూనివర్సిటీ ఆఫ్ నార్త్‌క్యారోలినా విల్మింగ్టన్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అశ్వని కె.వోలెటి, ప్రొఫెసర్ జెరెమీడికర్సన్ ఉన్నారు. వీరు గీతం విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎరోల్‌డిసోజా,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, వివిధ పాఠశాలల డీన్లతో నిర్వహించిన చర్చలలో పాల్గొన్నారు. సహ పరిశోధన కార్యక్రమాలు, అధ్యాపకుల మార్పిడి ప్రోగ్రాంలు, సంయుక్త అకాడమిక్ కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు.

## 'తాటితూరులో గెడ్డ పోరంబోకు కబ్జా'

తగరపువలస, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటితూరు గ్రామం వద్ద సర్వేనంబరు 86లో ఎకరా స్థలాన్ని రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జా చేసినట్టు మాలమహానాడు నాయకులు ఆరోపించారు. సోమవారం తగరపువలసలో నాయకులు గోపాలరావు, ఎం. శివకృష్ణ, నర్సింగరావు, రాంబాబు మాట్లాడారు. తాటితూరులో లే అవుట్ వేస్తున్న రియల్ ఎస్టేట్ సంస్థ ఆక్రమించిన స్థలం విలువ రూ. 2 కోట్లు ఉంటుందని ఆరోపించారు. ఇందులో రహదారి ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. దీనిపై గతనెల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తే పరిశీలనకు గ్రామ సచివాలయ సిబ్బందికి అప్పగించారన్నారు. వారు పరిశీలించకుండానే ఎటువంటి ఆక్రమణ లేదని తప్పుడు నివేదిక అందించారన్నారు. ఈ ఆక్రమణ విషయంలో సమగ్ర విచారణ చేయాలని, తప్పుడు నివేదికలు అందించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



భీమిలిలో ముస్తాబవుతున్న భ్రమరాంబికా చోడేశ్వరాలయం



శ్రీకాత్యాయిని భీమేశ్వరాలయం

# మహా శివరాత్రికి ఆలయాలు సిద్ధం

భీమునిపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రికి భీమిలిలోని భ్రమరాంబికా సహిత చోడేశ్వరాలయం, శ్రీకాత్యాయిని సహిత భీమేశ్వరాలయం, బాలా త్రిపుర సుందరి సహిత శ్రీచంద్రశేఖరాలయాలు సిద్ధమయ్యాయి. చోడేశ్వరాలయంలో బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి లింగోద్భవం వరకూ శివలింగానికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహిస్తారు.

బీచ్‌రోడ్‌లోని అయ్యప్ప ధ్యాన మందిరంలో పట్టణ పురోహితుడు సునరాపు కామేశ్వర మాధవశాస్త్రి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రంనుంచి మహా విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు. గొల్లవీధి శ్రీ కృష్ణ గుడి జంక్షన్‌లో ఆధ్యాత్మిక కార్యక్రమాలను యాదవ సంఘం ఆధ్వర్యంలో చేసినట్టు గొలగాని నరేంద్రకుమార్ తెలిపారు. బుధవారం రాత్రి ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి భక్తులు దీపారాధన చేస్తారన్నారు. బ్రహ్మగిరిపై శ్రీ బ్రహ్మగారి ఆలయంలో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహిస్తామని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు యానాపు శ్రీనివాసరావు తెలిపారు.

అయ్యప్ప స్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా శివరాత్రి పురస్కరించుకుని గోస్తనీ సాగర సంగమానికి విచ్చేసే భక్తులకు పులిహోర ప్రసాదం, భీమిలి శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం మంచినీటి సరఫరాను, భీమిలి సాగర అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ భక్తులకు టీ, బిస్కెట్లు భక్తులకు పంపిణీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## పవిత్రమైనది వైద్య విద్య

▸ ఏఐజీ చైర్మన్ పద్మవిభూషణ్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి



వైద్య విద్యార్థినికి పట్టా అందజేస్తున్న డాక్టర్ నాగేశ్వరరెడ్డి, తదితరులు

తగరపువలస, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అన్ని విద్యల్లో వైద్య విద్య, వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనవని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ (ఏఐజీ) చైర్మన్ పద్మవిభూషణ్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం తగరపువలస సమీపంలోని సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వైద్య వృత్తిలోకి వచ్చేవారు ఎంతో నిబద్ధతతో ఉండాలని, వృత్తిని దైవంగా భావించాలని కోరారు. తమ వద్దకు వచ్చే రోగులతో ఆప్యాయంగా ఉండాలన్నారు. అనంతరం ఆయన వైద్య విద్య పూర్తి చేసిన 123 మంది విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఉత్తమ విద్యార్థినిగా ఎంపికైన చలుమూరి మౌనికకు జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, సీఈవో డాక్టర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.కృష్ణమూర్తి, అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమాదేవి, డాక్టర్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థల ఆక్రమణకు అడ్డుకట్ట



ఆక్రమణదారులు చదును చేసిన స్థలం

భీమునిపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్ రోడ్డులోని నగరపాలెం కూడలిలో బీటీ రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు చదును చేయడాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించి అడ్డుకున్నారు. సంబంధిత స్థలం కాపులుప్పాడ సర్వే నంబర్-314లో భాగమని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు తెలిపారు. నగరానికి చెందిన కొందరు వ్యక్తులు సంబంధిత స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారన్నారు. ఈ విషయమై సమాచారం అందడంతో ఆదివారం సాయంత్రం సంబంధిత స్థలాన్ని పరిశీలించామన్నారు. అయితే ఆక్రమణదారులు రహదారికి మరో పక్కనున్న జిరాయితీ నంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలను చూపిస్తూ సర్కారు స్థలాన్ని ఆక్రమించబోయారన్నారు. వారి ఆక్రమణకు తాము అడ్డుకట్ట వేశామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఎవరు ఆక్రమించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రహదారిని విస్తరించాలని ఆందోళన

▸ సంగివలస వద్ద వాహనాలను అడ్డగించిన గ్రామస్థులు

▸ జీవీఎంసీ, పోలీసుల జోక్యంతో నిరసన విరమణ



సంగివలస సామేయవలస రహదారిలో నిలిచిన వాహనాలు

తగరపువలస, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో సంగివలస నుంచి సామేయవలస వరకు ఉన్న ప్రధాన రహదారి విస్తరించాలని కోరుతూ సోమవారం సాయంత్రం స్థానికులు నిరసన వ్యక్తంచేశారు. ఇరుకురోడ్డు దీనికి తోడు భారీ వాహనాలు, టాంకర్ల రాకపోకలతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామంటూ ఆందోళన వ్యక్తంచేశారు. మాస్టర్ ప్లాన్‌లో ఉన్న విధంగా రహదారిని విస్తరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. దీంతో జీవీఎంసీ అధికారులు వచ్చి రహదారి విస్తరణ చేపడతామని హామీ ఇవ్వడంతో అడ్డుకున్న వాహనాలను వదిలిపెట్టారు. తర్వాత ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి మరో గంట సమయం పట్టింది. ఈ రహదారి ఇరుగ్గా ఉంటుంది. ఇదే మార్గంలో సామేయవలస సమీపంలో గోస్తనీనదిలో నీటిని నింపుకుని టాంకర్లు ప్రయాణిస్తుంటాయి వీటితో పాటు పద్మనాభం, తగరపువలస మధ్య భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ స్థితిలో వాహనాలు తప్పుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతాయి. దుమ్ము, ధూళితో పరిసర గృహస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామస్థులు చోడిపల్లి జయశంకర్ ఆధ్వర్యంలో వాహనాలను అడ్డుకున్నారు. పోలీసులు, జీవీఎంసీ అధికారులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

## సుందరకాండలో వాల్మీకి వర్ణన అద్భుతం: చాగంటి



సీతారాములకు నమస్కరిస్కరిస్తున్న చాగంటి

కొమ్మాది, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రామాయణ రచనలో అశోకవనంలో ఉన్న సీతమ్మను హనుమ దృష్టికోణం నుంచి ఆమె పరిస్థితిని వాల్మీకి మహర్షి ఆవిష్కరించిన తీరు అత్యంత అద్భుతమని ప్రముఖ ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణరామాయణం ప్రవచనాలలో భాగంగా సుందరకాండను సోమవారం వివరించారు. అశోకవనంలో సీతమ్మ బాధతో ఉండడం చివరికి లంకకు చేటు తీసుకువచ్చిందన్నారు.సీతను చూసిన హనుమ పొందిన అనేక భావాలను వాల్మీకి గొప్పగా వివరించారన్నారు. రావణుని పతనం అన్వయించేలా శ్లోకాల్లో వివరించారు. సీతను వదలి రాముడు స్థితిని గొప్పగా వివరించారన్నారు. రావణుడు ఎన్నో ప్రలోభాలతో మాటలు చెప్పినా, మహాపతివ్రత అయిన సీత చలించలేదన్నారు. ఈ కార్య క్రమంలో అష్టలక్ష్మీదేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్యసోమరాజు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

కొమ్మాది, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పి.ఎం.పాలెం సబ్ స్టేషన్ పరిధి మొగదారమ్మ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ అప్పలనాయుడు తెలిపారు. జె.యన్.ఎన్.ఆర్.ఎం.కాలనీ, సైబర్ వ్యాలీ లేఅవుట్, సినీ పోలీస్‌రోడ్, రుద్రరాజు లేవుట్, తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

## 'పద్మనాభం' బీజేపీ అధ్యక్షురాలిగా నాగమణి



నాగమణికి నియామక పత్రాన్ని అందజేస్తున్న పరశురామరాజు

పద్మనాభం-రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ పద్మనాభం మండల అధ్యక్షురాలిగా తమటపు నాగమణిని నియ మించారు. ఈ మేరకు సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు మంతెన మురళీనాగపరశురామరాజు ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బీజేపీ బలోపేతాయనికి కృషి చేయాలని సూచించారు. నాగమణి మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. మహిళా మోర్చా, దళిత మోర్చా, తదితర కమిటీలను మండలంలోని ఏర్పాటు చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ వైద్య విభాగ కన్వీనర్ రవికుమార్, మండల మాజీ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, నాయకులు యు.అప్పారావు, పి.కృష్ణారావు, ఎస్.వెంకటరావు, ఎం.సంతోశ్, కె.సత్యవతి, కె.ఈశ్వరరావు, కైలాశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని కోరుతూ డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండేకు ఇంటక్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు ఇప్పటికే 255 శాతం వేతనాలు పెండింగ్ ఉన్నాయని, సరిగ్గా జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్మిక వర్గానికి ఇప్పటికే పలు సౌకర్యాలను తొలగించారని, హెచ్ఆర్ఏ ఆపేశారని, అదే క్రమంలో వేతనాలు కూడా సరిగ్గా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి, నాయకులు కారు రమణ, సుబ్బయ్య, ఎస్ఏ నాయుడు, ఎం.దేముడు, ఉన్నారు.

### కార్మికులకు తీరని అన్యాయం

గడిచిన నాలుగేళ్లలో ఉక్కు కర్మాగార కార్మిక వర్గానికి యాజమాన్యం, గుర్తింపు యూనియన్‌లు కలిపి తీరని అన్యాయం చేశాయని ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంటులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటక్ గుర్తింపులో ఉన్న సమయంలో ఒప్పందాలు చేసిన ఆర్థిక ప్రయోజనాలకు ఆ తరువాత గుర్తింపులోకి వచ్చిన యూనియన్‌లు మంగళం పాడాయని ఆరోపించారు.

## విధులు వదిలేసి...! రోడ్డుకు అడ్డంగా కాసి...!!

... 5వ పేజీ తరువాయి

చెక్ చేస్తున్నారు. చలాన్‌లు పెండింగ్‌లో లేకపోతే వారిని...ఇక వెళ్లిపోవచ్చునంటూ పంపిస్తున్నారు. గత ఏడాది జూలై కంటే ముందు పోలీసులు జారీచేసిన ఈ-చలాన్‌లన్నీ సాంకేతిక కారణాలతో డిలీట్ అయిపోయాయి. ఆ తర్వాత ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనలకు సంబంధించి పోలీసులు సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీసిన వారికి మాత్రమే ఈ-చలాన్‌లు జారీ అయ్యాయి. దీనివల్ల పెండింగ్ చలాన్‌లు ఉన్న వాహనాలు 20 శాతంలోపే ఉంటాయని పోలీసు అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ ఇరవై శాతం వాహనాలను గుర్తించేందుకు అన్ని వాహనాలను కూడళ్ల వద్ద నిలిపేయడం వల్ల వాహన చోదకులు ఇబ్బందిపడాల్సి వస్తోంది. ఈ క్రమంలో మద్దిలపాలెం జంక్షన్, గొల్లలపాలెం జంక్షన్, గురుద్వార జంక్షన్, అక్కయ్యపాలెం జంక్షన్ వంటి ప్రాంతాల్లో పోలీసులతో తరచూ వాహన చోదకులు వాగ్వాదానికి దిగుతున్నారు. దీనిపై సీపీ శంఖబ్రతబాగ్చి దృష్టిసారించి పెండింగ్ చలాన్‌లు వసూలు చేసేందుకు మెరుగైన మార్గాన్ని సిబ్బందికి సూచించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

## హోరాహోరీగా ఎమ్మెల్సీ పోరు

... 5వ పేజీ తరువాయి

48 గంటల ముందు అంటే మంగళవారం సాయంత్రం నాలుగు గంటలతో ప్రచారం ముగియనున్నది. జిల్లా కేంద్రాలకు బ్యాలెట్ పత్రాలు నాలుగు రోజుల క్రితమే చేరాయి. పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తిచేయడంతోపాటు సోమవారం ర్యాండమైజేషన్ నిర్వహించారు. బుధవారం సాయంత్రానికికల్లా సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా ఏర్పాట్లుచేశారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహణకు పోలీసుల బందోబస్తు ఏర్పాటుచేశారు. ఓట్ల లెక్కింపు వచ్చే నెల మూడో తేదీన జరగనున్నది.

## రవాణా, ట్రాఫిక్ వ్యవస్థల మెరుగుకు ఉమ్టా

... 5వ పేజీ తరువాయి

తప్ప అక్కడకు చేరుకునే మార్గం లేదు. గంటలో చేరాల్సిన సమయం అంతకు రెట్టింపుగా ఉంటోంది. ఈ సమస్యల పరిష్కారానికి పోలీస్, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, హైవే అథారిటీ...ఎవరికి వారు కాకుండా సంబంధిత సంస్థలన్నీ ఒక గొడుగు కింద పనిచేస్తే బాగుంటుందని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ప్రభుత్వానికి లేఖ రాయగా దానిని పరిశీలించి ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఉమ్టా ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. దీనికి కమిటీని ఏర్పాటుచేసింది. పురపాలన పట్టణాభివృద్ధి సంస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో ఆర్థిక శాఖ సెక్రటరీ, వీఎంఆర్‌డీఏ కమిషనర్, విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల కలెక్టర్లు, ఈపీడీసీఎల్ సీఎండీ, జీవీఎంసీ కమిషనర్, విశాఖ సిటీ పోలీస్ కమిషనర్, విజయనగరం మునిసిపల్ కమిషనర్, ఎలమంచిలి మునిసిపల్ కమిషనర్, నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్, ఏపీఎస్ఆర్‌టీసీ ఎండీ, వాల్తేరు డీఆర్ఎం, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సెక్రటరీ, రవాణా శాఖ కమిషనర్, మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీలను సభ్యులుగా, ఏయూ, జేఎన్‌టీయూ, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీల నుంచి ఒక్కొక్కరు చొప్పున ముగ్గురిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరంతా వీఎంఆర్‌డీఏ పరిధిలో ఏకీకృత రవాణా వ్యవస్థ ఏర్పాటుకు యత్నిస్తారు.

## అధికార అండతో అక్రమ నిర్మాణం!

... 5వ పేజీ తరువాయి

విరుద్ధంగా బహుళ అంతస్థుల భవనం నిర్మిస్తున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే....జీవీఎంసీ 67వ వార్డు పరిధిలోని పంతులుగారి మేడ ప్రాంతంలో జాతీయ రహదారి పక్కనే ప్రజా ప్రతినిధి సోదరి భారీ భవనం నిర్మిస్తున్నారు. నిర్మాణ అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో నామమాత్రపు ఫీజు చెల్లించారు.

ఈ క్రమంలో వచ్చిన బీపీ నంబర్ చూపించి ఇప్పటికే నాలుగు అంతస్థుల భవనం నిర్మించి ఓ ప్రైవేటు సంస్థకు అద్దెకు ఇచ్చారు. గత పది రోజులుగా ఐదో అంతస్థు నిర్మాణానికి పనులు చేపట్టారు. ప్లాన్ అప్రూవల్ కోసం స్థలం ఉన్నదాని కంటే ఎక్కువ విస్తీర్ణం చూపించారనే ఆరోపణ కూడా ఉంది. వాస్తవానికి రహదారి సౌకర్యం, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆ భవన నిర్మాణానికి టౌన్‌ప్లానింగ్ విభాగం అనుమతులు నిరాకరించినట్టు తెలిసింది. అయినప్పటికీ పట్టించుకోకుండా నిర్మాణం కొనసాగిస్తున్నారు. ఈ విషయమై టౌన్‌ప్లానింగ్ విభాగం ఏసీపీ వెంకటరావును వివరణ కోరగా భవనాన్ని పరిశీలించి నిబంధనలను అతిక్రమించినట్టయితే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పల్సస్ ఉద్యోగుల ఆందోళన

... 5వ పేజీ తరువాయి

తమనే రెండు వేల రూపాయలు కట్టాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారన్నారు. ఉద్యోగుల ఆందోళన గురించి సమాచారం అందడంతో పోతినమల్లయ్యపాలెం సీఐ బాలకృష్ణ, ఎస్ఐ కె.భాస్కరరావులు కంపెనీ వద్దకు చేరుకున్నారు. యాజమాన్యానికి, ఉద్యోగులకు మధ్య చర్చల కోసం విఫలయత్నం చేశారు. అయితే యాజమాన్యం దిగిరాకపోయేసరికి ఉద్యోగులు ఆందోళన ఉధృతం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

పల్సస్‌లో సుమారు 352 మంది పనిచేస్తున్నారు. వీరికి సంస్థ రూ.18 వేలు నుంచి రూ.21 వేలు చెల్లించాల్సి ఉంది. కానీ సక్రమంగా ఇవ్వడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు. ఈ కంపెనీకి సీఈవోగా గేదెల శ్రీనుబాబు, ఎండీగా శంకర్ వ్యవహరిస్తున్నారు.

## అప్పన్న స్వామికి ఇంటర్ విద్యార్థుల పూజలు



రాజగోపురం వద్ద హాల్ టికెట్లతో విద్యార్థినులు

సింహాచలం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఇంటర్ పరీక్షలను బాగా రాయాలని ప్రార్థిస్తూ సోమవారం పలువురు విద్యార్థులు సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ హాల్ టికెట్లను అంతరాలయంలో స్వామివారి చెంత ఉంచి తమపై కరుణ చూపాలని వేడుకున్నారు. అలాగే కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని ప్రార్థనలు చేశారు.

## జోరుగా సాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం

భీమునిపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి పలు ప్రాంతాల్లో ప్రచారం జోరుగా సాగుతుంది. టీచర్ల సమస్యల పరిష్కారంలో అంకితభావంతో పనిచేసే గాదె శ్రీనివాసుల నాయుడుకు మద్దతుగా పలువురు ఉపాధ్యాయులు పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో గరికిన పరదేశి, జి.సత్యనారాయణ, అప్పలరాజు, ఉదయ్‌కుమార్, ప్రభాకర్, పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్సీగా రఘువర్మను గెలిపంచాలంటూ భీమిలిలో టీడీపీ మూడో డివిజన్ అధ్యక్షుడు గొలగాని నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ప్రచారం చేశారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డిగ్రీ కళాశాల, జూనియర్ కాలేజీ, పాలిటెక్నిక్ కళాశాల, జీవీఎంసీ హైస్కూళ్లు, తదితర పాఠశాలల్లో ప్రచారం చేపట్టారు.

**పద్మనాభం-రూరల్:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో పాకలపాటి రఘువర్మను గెలిపించాలని కోరుతూ భీమిలి పరిశీలకులు, రాష్ట్ర కళింగ కార్యదర్శి అన్నెపు భువనేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని మద్ది, పద్మనాభం, అనంతవరం, పాండ్రంగి, రెడ్డిపల్లి, బాపిరాజు తాళ్లవలస, చిన్నాపురం, రేవిడి గ్రామాల్లో ప్రచారం చేశారు.

## 48 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం

గాజువాక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డిఫెన్స్ మద్యం బాటిళ్లు కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను గాజువాకఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. గాజువాక వంటిళ్ల జంక్షన్ ప్రాంతానికి చెందిన బసా మణికంఠ, సురేశ్‌బాబులు 48 డిఫెన్స్ మద్యం బాటిళ్లు కలిగి ఉన్నట్టు సమాచారం రావడంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి వారి వద్ద నుంచి బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో కేసులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వడ్లపూడి ప్రాంతానికి చెందిన కర్రి భాస్కరరావును గాజువాక తహశీల్దార్ ఎదుట ప్రవేశపెట్టగా రూ.25 వేల జరిమానా విధించారు.

## ఆలయ హుండీని తస్కరించిన వ్యక్తి అరెస్టు

గాజువాక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గాజువాక వాంబే కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీని తస్కరించిన వ్యక్తిని గాజువాక క్రైమ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. హుండీని అదే ప్రాంతానికి చెందిన ఎస్.అచ్చింనాయుడు అనే వ్యక్తి తస్కరించి వెళ్లగా స్థానిక యువకులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుని వద్ద నుంచి పోలీసులు రూ.6,300 స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు స్టీల్‌ప్లాంట్ ఓబీసీ సంఘం మహాజన సభ

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాలుగో సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు స్టీల్ క్లబ్‌లో నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు బి.అప్పారావు తెలిపారు. కొన్ని కీలక అంశాలపై చర్చించడంతో పాటు పలు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సోమన్నారాయణ

## స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధనే లక్ష్యం కావాలి

### జీవీఎంసీ ఏడీసీ సోమన్నారాయణ

వేపగుంట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ నగరాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జీవీఎంసీ ఏడీసీ సోమన్నారాయణ కోరారు. నాయుడు తోటలోని విహాన్ కల్యాణ మండపంలో సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్, ప్రజల అభిప్రాయాలను ఏ విధంగా సేకరించాలనే అంశాలపై యూసీడీ, పారిశుధ్యం, తదితర విభాగాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ నగరం ప్రతిష్ఠను రాష్ట్రం, దేశ స్థాయిలో ప్రతిబింబించేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు. పలువురి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జోన్-8 జడ్సీ కె.హైమావతి, ఏఎంహెచ్‌వో బండారు అప్పలనాయుడు, ఏపీడీ చిరంజీవి, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

## మగ్గం వర్క్‌లో శిక్షణ

మల్కాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 58వ వార్డు పరిధి పిలకవానిపాలెంలో మహిళలకు మగ్గం వర్క్‌లో శిక్షణ ఇచ్చేందుకు కోరమాండల్ ఎరువుల కర్మాగారం శ్రీకారం చుట్టుంది. ఇందుకోసం రూ.నాలుగు లక్షలను వెచ్చిస్తుంది. మహిళలకు 45 రోజుల పాటు మగ్గం వర్క్‌లో శిక్షణ ఇచ్చి వారి స్వయం ఉపాధికి సహకరించనున్నది. సోమవారం ప్రారంభమైన శిక్షణ కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ మేనేజర్ శేషపు వెంకటరమణ, మేనేజర్ (హెచ్ఆర్) సంతోశ్, అడ్మిన్ అధికారి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు పరదేశిమాంబ పండగ

అగనంపూడి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఈ-బోనంగి ప్రజల ఆరాధ్య దేవత పరదేశిమాంబ పండగను మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి పూజాది కార్యక్రమాలు ప్రారంభమవుతాయని మాజీ సర్పంచ్ అట్టా సన్యాసి అప్పారావు తెలిపారు. రాత్రి ఏడు గంటల నుంచి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

## నేడు ద్విచక్ర వాహనాల వేలం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం ద్విచక్ర వాహనాల వేలం పాట నిర్వహిస్తున్నట్టు క్రైమ్ పోలీసులు తెలిపారు. ఎంతో కాలంగా ఇక్కడ ఉండిపోయిన ద్విచక్ర వాహనాలకు తహశీల్దార్ అనుమతితో వేలం నిర్వహిస్తున్నామన్నారు.

## సినిమా గైడ్

- **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక),
- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)
- **తండేల్:** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 13, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 44, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 38, బీరకాయలు 64, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 12, క్యారెట్ 34 దొండకాయలు 32, బంగాళదుంపలు 14, అరటికాయ (పె)6, అల్లం (పాతది) 52, మునక్కాడలు (కిలో) 68, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 32, కీరదోస 28, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 40, గోరుచిక్కుడు 36, కూరపెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

| కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో) | |
|---|---|
| విశాఖపట్నం | 470 |
| విజయనగరం | 474 |
| శ్రీకాకుళం | 474 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 65 |
| లైవ్ ధర | 85 |
| విత్ స్కిన్ | 140 |
| స్కిన్‌లెస్ | 150 |



కంపెనీలకు చెందిన బస్సుల కోసం వేచివున్న ఫార్మా ఉద్యోగులు, కార్మికులు



హైవేపై బస్సులను ఆపి ఫార్మా ఉద్యోగులు, కార్మికులను ఎక్కిస్తున్న దృశ్యం

# బాబోయ్ ఫార్మా బస్సులు!

- తరచూ రోడ్డు ప్రమాదాలతో బెంబేలెత్తిపోతున్న వాహనాదారులు
- రవాణాశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు

అగనంపూడి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అగనంపూడి, పరిసర ప్రాంతాల్లో ఫార్మా బస్సులు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఫార్మా బస్సులు రాకపోకలు సాగిస్తుండడంతో నిత్యం ఈ మార్గంలో ప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో వాహనదారులతో పాటు స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఫార్మాసిటీలో గల వివిధ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, షిర్డీసాయి నగర్, గల్లవానిపాలెం, శనివాడ, గౌరీనగర్ వేపచెట్టు జంక్షన్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. వీరంతా నిత్యం తమ కంపెనీలకు చెందిన బస్సుల్లో విధులకు హాజరవుతూ వస్తున్నారు. ఉద్యోగులు, కార్మికులు జాతీయ రహదారికి వచ్చి ఆయా కంపెనీలకు చెందిన బస్సుల్లో రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. ఫార్మా బస్సులను హైవేపై అడుగడుగునా నిలిపివేసి ఉద్యోగులు, కార్మికులను ఎక్కిస్తుండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సు డ్రైవర్లు ఇష్టానుసారంగా నిలిపివేయడంతో వెనక వచ్చే వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెతున్నాయి.

అగనంపూడి టోల్ గేటు సమీపంలో గౌరీనగర్ నుంచి శివాజీనగర్, షిర్డీసాయి నగర్, గల్లవానిపాలెం, ఆంజనేయస్వామి సిగ్నల్ కూడలి, అగనంపూడి జంక్షన్, శివాలయం వద్ద, డొంకాడ, ఇ-మర్రిపాలెం వద్ద బస్సులను నిలిపివేస్తూ ఆయా కంపెనీలకు చెందిన ఉద్యోగులు, కార్మికులను ఎక్కిస్తున్నారు. ఫార్మాసిటీలో సుమారు 80 వరకు ఫార్మా పరిశ్రమలు ఉన్నాయి. దీంతో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఈ రహదారిలో ఫార్మా బస్సుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రవాణాశాఖ నిబంధనల ప్రకారం ప్రతిచోట బస్సులను నిలిపివేసి ఎక్కించకూడదు. కానీ ఇక్కడ ఫార్మా బస్సులను ఇష్టానుసారంగా జాతీయ రహదారిపై నిలిపివేస్తున్నారు. ఈ కారణంగా ఇటీవల పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఎక్కడపడితే అక్కడ ఫార్మా బస్సులను ఆపకుండా రవాణాశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### అడుగడుగునా ఆపేస్తున్నారు..



ఫార్మా బస్సులను అగనంపూడిలో అడుగడుగునా నిలిపివేసి ఉద్యోగులు, కార్మికులను ఎక్కిస్తున్నారు. జాతీయ రహదారి కావడంతో నిత్యం మార్గం రద్దీగా ఉంటుంది. దీంతో వెనక వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతుండడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్నాయి. నిత్యం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఫార్మా బస్సుల కారణంగా స్థానికులతో పాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు నానాపాట్లు పడుతున్నారు. రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

-విందుల చిరురాజు, పెదమడక

# ఆటోనగర్‌లో ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ప్రారంభం




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ డీఎఫ్‌వో వీజేడీ విజయకుమార్

ఆటోనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ ఎంఎస్ఎంఈ కార్యాలయం వద్ద రెండు రోజుల పాటు జరిగే వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కమ్ బయ్యర్ సెల్లర్ మీట్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ప్రోగ్రామ్‌ను సోమవారం హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (మెటీరియల్స్) కె.తిరుమురుగన్, బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సత్యప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈల ప్రయోజనాల కోసం వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ- డీఎఫ్‌వో కృషి అభినందనీయమన్నారు. హెచ్‌సీసీఎల్ ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తుందని, పబ్లిక్ ప్రొక్యూయర్‌మెంట్ పాలసీ (పీపీపీ-2012) ద్వారా నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తుందన్నారు. బీఎస్ఎన్‌ఎల్‌కు ఎంఎస్ ఎంఈలతో ఉన్న అవకాశాలను వివరించారు. ఎంఎస్ఎంఈ డీఎఫ్‌వో విశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్ మాట్లాడుతూ స్థానిక ఎంఎస్ఈలకు వివిధ కంపెనీలు ఇస్తున్న ప్రోత్సాహాన్ని ప్రశంసించారు. దేశ ప్రగతికి ఎంఎస్ఎంఈలు వెన్నెముకగా నిలుస్తున్నాయన్నారు. ఎంఎస్ఎంఈ అదనపు డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కింద రిజస్ట్రేషన్లు సంఖ్యాపరంగా దేశంలోనే ఏపీ రెండో స్థానంలో ఉందన్నారు. పారిశ్రామిక ఉత్పత్తులు, బ్యాంకులకు సంబంధించి ఏర్పాటు చేసిన 32 స్టాళ్లను సందర్శించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తరలివచ్చారు. కార్యక్రమంలో వాసీవా కార్యదర్శి వి.రామ్‌ప్రసాద్, పీఐడబ్ల్యూఏ అధ్యక్షుడు సత్యనారాయణ, యూకో బ్యాంక్ చీఫ్ మేనేజర్ డీవీ రావు, ఆర్ఐఎన్ఎల్ డీజీఎం స్మిత, హెచ్‌పీసీఎల్ జీఎం ఎం.సుధాకర్, ఐపీ అడ్వకేట్ ఎం.సుధీర్, హెచ్‌పీసీఎల్, ఆర్ఐఎన్ఎల్, బీఎస్ఎన్ఎల్, ఎఫ్‌సీఐ, ఎన్ఆర్‌డీసీ, ఎస్ఐడీబీఐ, ఎస్‌బీఐ, యూబీఐ, పీఎస్‌బీ, యూకో బ్యాంకుల ప్రతినిధులతో పాటు పారిశ్రామికవేత్తలు కృష్ణప్రసాద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌కు ఆనుకుని కొండలో అక్రమ మైనింగ్

## గుర్రంపాలెంలో ఆగని అక్రమ మైనింగ్

- వారం నుంచి రాత్రిపూట తవ్వకాలు
- పట్టించుకోని గనుల శాఖ, విజిలెన్స్

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న కొండలను కొంతమంది యథేచ్ఛగా తవ్వుకుంటున్నారు. ప్రతిరోజు రాత్రి ఎనిమిది నుంచి తెల్లవారుజాము నాలుగు గంటల వరకు యంత్రాలతో తవ్వి రాయి, గ్రావెల్, మట్టి సమీపంలోని పారిశ్రామిక లేఅవుట్‌లో గల ప్లాట్లకు తరలిస్తున్నారు. తవ్వకాలకు గనుల శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవు. గతంలో అదే ప్రాంతంలో వందలాది లారీల గ్రావెల్ తవ్వినా గనుల శాఖ, గనుల శాఖ విజిలెన్స్ అధికారులు తూతూమంత్రంగా దాడులు చేసి నోటీసులు ఇచ్చారు తప్ప వారి నుంచి జరిమానా వసూలు చేయలేదు. దాంతో అక్రమార్కులు మరింత బరితెగించారు. ఈ వ్యవహారంలో గనుల శాఖ, గనుల శాఖ విజిలెన్స్‌లో కొందరు అధికారులు, సిబ్బంది ఒప్పందం కుదిరినట్టు ఆరోపణలున్నాయి. అందుకే స్థానికంగా ఎవరైనా ఫోన్ చేసినా పట్టించుకోకపోగా తిరిగి అక్రమార్కులను అప్రమత్తం చేస్తున్నారంటున్నారు. కాగా గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌లో ప్లాట్ల ఫిల్లింగ్‌కు అవసరమైన గ్రావెల్, మట్టి తరలింపు వెనుక కూటమి నేతల హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. కీలక వ్యక్తులకు లక్షల రూపాయల ముడుపులు అందాయంటున్నారు.

## ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని కోరుతూ డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండేకు ఇంటక్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు ఇప్పటికే 255 శాతం వేతనాలు పెండింగ్ ఉన్నాయని, సరిగ్గా జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్మిక వర్గానికి ఇప్పటికే పలు సౌకర్యాలను తొలగించారని, హెచ్ఆర్ఏ ఆపేశారని, అదే క్రమంలో వేతనాలు కూడా సరిగ్గా ఇవ్వలేదని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి, నాయకులు కారు రమణ, జీవీ సుబ్బయ్య, ఎస్ఏ నాయుడు, ఎం.దేముడు, ఎన్.వెంకన్న ఉన్నారు.

### కార్మికులకు తీరని అన్యాయం

గడిచిన నాలుగేళ్లలో ఉక్కు కర్మాగార కార్మిక వర్గానికి యాజమాన్యం, గుర్తింపు యూనియన్‌లు కలిపి తీరని అన్యాయం చేశాయని ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంటులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటక్ గుర్తింపులో ఉన్న సమయంలో ఒప్పందాలు చేసిన ఆర్థిక ప్రయోజనాలకు ఆ తరువాత గుర్తింపులోకి వచ్చిన యూనియన్‌లు మంగళం పాడాయని ఆరోపించారు. కార్మికులకు వేతన సవరణ చేయలేకపోయారని, ఇన్సెంటివ్‌ను తగ్గించే పరిస్థితులు వచ్చాయన్నారు. కార్మిక వర్గానికి అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పీవీ రమణమూర్తి, బీఎస్ రాజు, కారు రమణ, కొమ్ము ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### ఐక్య ఉద్యమాలతో ప్రతిఘటించండి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఐక్య ఉద్యమాలతో ప్రతిఘటించాలని సీఐటీయూ ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. ప్లాంటులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారని, ఇది దేశ భవిష్యత్తుకు ప్రమాదమన్నారు. ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలని, కర్మాగారాన్ని కార్పొరేట్లకు అప్పగించే కుట్రను తిప్పికొడతామన్నారు. సమావేశంలో నాయకులు వైటీ దాసు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నీలకంఠం, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



గాజువాకలో ఓ ఇంటి వద్ద వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

## పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఇంటింటా వైద్య సర్వే

గాజువాక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గాజువాక పీహెచ్‌సీ పరిధిలోని 11 సచివాలయాల్లో 18 ఏళ్లు దాటిన వారందరికీ మెడికల్ సర్వే నిర్వహిస్తున్నారు. షుగర్, బీపీ, నోటి క్యాన్సర్, బ్రెస్ట్, గర్భాశయ క్యాన్సర్, తదితర పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం గాజువాకలోని పలు ప్రాంతాల్లోని ప్రజలకు పరీక్షలు చేశారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేసేందుకు నమూనాలు సేకరిస్తున్నారు. గాజువాకలో ఇప్పటివరకు 9,584 మందికి స్క్రీనింగ్ టెస్టులు చేసినట్టు ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ తెలిపారు.

## నన్ను చంపేయమనండి...లేకపోతే నేనే చంపేస్తా

- స్పీకర్ అయ్యన్నపాత్రుడును ఉద్దేశించి
- వైసీపీ నేత కర్రి శ్రీనివాసరావు అభ్యంతరకర వ్యాఖ్యలు



కర్రి శ్రీనివాసరావు

నర్సీపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'నా కుటుంబాన్ని ఎందుకు బాధ పెడతారు...నన్ను చంపేయమనండి, లేదంతే నేనే ఆయన్ని చంపేస్తాను...' అంటూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును ఉద్దేశించి వైసీపీ నాయకుడు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు అభ్యంతకర వ్యాఖ్యలు చేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం శారదా నగర్‌లో కర్రి శ్రీనివాసరావు సోదరుడు సత్యనారాయణ ప్రభుత్వ స్థలంలో భవనం నిర్మించారని రెవెన్యూ అధికారులు సోమవారం తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తాము ఎవరి వద్ద కొన్నామో...ఆమె భవనాన్ని ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నించారు. ఆ భవనాన్ని కూల్చేసి, తరువాత తమ భవనం వద్దకు రావాలన్నారు. స్పీకర్ కుర్చీలో కూర్చుని మాట్లాడడం కాదు...దమ్ముంటే ఇక్కడకు వచ్చి మాట్లాడాలని సవాల్ చేశారు. తనపై కక్షతో తన కుటుంబాన్ని రోడ్డు మీదకు లాగాలని చూస్తున్నారని ఆరోపించారు.

## జ్యోతిర్లింగాల ప్రదర్శన ప్రారంభం

అగనంపూడి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని పురస్కరించుకుని ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ అగనంపూడి శాఖ ఆధ్వర్యంలో బీసీ కాలనీలోని దివ్యజ్యోతి భవన్ వద్ద సోమవారం ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శనను కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, బ్రహ్మకుమారీస్ సంస్థ జిల్లా ఇన్‌చార్జి బీకే వేణులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అనేక ప్రాంతాల్లో ఉన్న జ్యోతిర్లింగాలను ఒకేచోట భక్తులకు దర్శన భాగ్యం కల్పించడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం.నీలబాబు, జి.సోమశేఖర్, బి.సత్యనారాయణ, గుదే సుశీల గజేంద్రరరావు, సంస్థ ప్రతినిధులు సోమేశ్వరి, రామకోటి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అమర్‌నాథ్‌ను కలిసిన వైసీపీ నాయకులు

పెందుర్తి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా కమిటీలో పెందుర్తి నియోజకవర్గం నుంచి స్థానం పొందిన ఉపాధ్యక్షుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ సోమవారం మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్‌ను అదీప్‌రాజ్ సత్కరించగా, దేవిసాంబ పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం పార్టీ బలోపేతంపై వారు చర్చించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి జోబ్‌దాస్, మండల అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, ఎంపీటీసీ చిరికి దేవుడు, శివ పాల్గొన్నారు.



గోపాలపట్నం పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు

## మృతదేహంతో పోలీస్ స్టేషన్ వద్ద నిరసన

గోపాలపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆయన కుటుంబీకులు మృతదేహాన్ని పోలీస్ స్టేషన్ బయట ఉంచి నిరసన చేపట్టారు. ఇక్కడి ఇందిరానగర్‌కు చెందిన సోమేశ్ అనే ఆటోడ్రైవర్ తన పర్స్ పోయిందని అదే ప్రాంతానికి చెందిన రౌతు ఆనంద్ (33), నాగరాజు అనే వ్యక్తులపై ఈ నెల 21న గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఆనంద్, నాగరాజులను స్టేషన్‌కు పిలిచి విచారిస్తున్నారు. అయితే దొంతనం కేసులో తనను పోలీస్టేషన్‌కు పిలిపించడంతో మనస్తాపానికి గురైన ఆనంద్ ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆనంద్ ఆత్మహత్యకు పోలీసులే కారణమంటూ కుటుంబ సభ్యులు మృతదేహంతో స్టేషన్ వద్దకు వచ్చి నిరసనకు దిగారు. సోమవారం కేజీహెచ్ నుంచి ఆనంద్ మృతదేహాన్ని తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులు పోలీస్ స్టేషన్ బయట మృతదేహాన్ని ఉంచి సాయంత్రం వరకు నిరసన తెలిపారు. దీంతో సీఐ అప్పారావు మృతుని కుటుంబీకులతో మాట్లాడి ఘటనపై విచారణ జరిపించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో సాయంత్రం ఆరు గంటలకు మృతదేహాన్ని తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

## బైకును ఢీకొన్న కారు

### అపస్మారక స్థితిలో ఐటీ ఉద్యోగిని.. మరొకరికి తీవ్ర గాయాలు



అపస్మారక స్థితిలో ఉన్న జ్యోతిర్మయి



తీవ్రంగా గాయపడిన ర్యాపిడో డ్రైవర్

సాగర్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్ రోడ్డు ఐటీ జంక్షన్ కూడలి సమీపంలో సోమవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఐటీ ఉద్యోగినికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నారు. అలాగే ర్యాపిడో బైక్ డ్రైవర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ ప్రమాదంలో పెదగంట్యాడ వుడా కాలనీ సమీపంలోని వినాయకనగర్‌కు చెందిన గునిశెట్టి జ్యోతిర్మయి (33) అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఆమె బెంగళూరులోని ఇన్ఫోసిస్ సంస్థలో పదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అనివార్య కారణాల వల్ల ఆమె విశాఖలో ఉండాల్సి రావడంతో రుషికొండ ఐటీ హిల్స్‌లో ఉన్న ఇన్ఫోసిస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో విధులు ముగించుకుని తిరిగి నగరంలోకి వచ్చేందుకుగాను ర్యాపిడో బుక్ చేసుకుని బైకుపై బయలుదేరారు. ఈ క్రమంలో ఐటీ కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా తిమ్మాపురం వైపు వెళ్తున్న ఓ కారు వేగంగా వచ్చి బైకును ఢీకొంది. దీంతో బైకు వంద మీటర్ల దూరం ఎగిరిపడింది. దీంతో తీవ్ర గాయాలకు గురైన జ్యోతిర్మయిని, ర్యాపిడో డ్రైవర్‌ను ఎస్ఐ కె.భాస్కర్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బైకు డ్రైవర్ పేరు, ఇతర వివరాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 48 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం

గాజువాక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డిఫెన్స్ మద్యం బాటిళ్లు కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను గాజువాక ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. గాజువాక వంటిళ్ల జంక్షన్ ప్రాంతానికి చెందిన బసా మణికంఠ, సురేశ్‌బాబులు 48 డిఫెన్స్ మద్యం బాటిళ్లు కలిగి ఉన్నట్టు సమాచారం రావడంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి వారి వద్ద నుంచి బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో కేసులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వడ్లపూడి ప్రాంతానికి చెందిన కర్రి భాస్కరరావును గాజువాక తహశీల్దార్ ఎదుట ప్రవేశపెట్టగా రూ.25 వేల జరిమానా విధించారు.

## ఆలయ హుండీని తస్కరించిన వ్యక్తి అరెస్టు

గాజువాక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గాజువాక వాంబే కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీని తస్కరించిన వ్యక్తిని గాజువాక క్రైమ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. హుండీని అదే ప్రాంతానికి చెందిన ఎస్.అచ్చింనాయుడు అనే వ్యక్తి తస్కరించి వెళ్లగా స్థానిక యువకులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుని వద్ద నుంచి పోలీసులు రూ.6,300 స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్టీల్‌ప్లాంటులో ఉద్యోగం పేరిట మోసగించిన ఇంటక్ నాయకుడి అరెస్టు

గాజువాక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తిని మోసగించిన ఇంటక్ ప్లాంట్ నాయకుడిని గాజువాక పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. ఇంటక్ ప్లాంట్ నాయకుడు కె.రమణ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి గత ఏడాది జూలైలో రూ.లక్షా 50 వేలు తీసుకున్నాడని, ఇప్పటివరకు ఉద్యోగం ఇప్పించలేదని విజయనగరం జిల్లా ఎల్.కోట ప్రాంతానికి చెందిన లెక్కల అనిల్ అనే వ్యక్తి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన రమణ సీఐ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దుర్భాషలాడాడు. దీంతో పోలీసులు రమణను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

## కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు పందిరిరాట



పందిరిరాట వేస్తున్న దృశ్యం

వేపగుంట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం సోమవారం పందిరిరాట వేశారు. మార్చి రెండో తేదీ నుంచి జరిగే ఉత్సవాల్లో భాగంగా ఆ రోజు శ్రీవారి శోభాయాత్ర, అనంతరం ఉత్సవాలకు అంకుర్పారణ చేస్తామని అర్చకులు శ్రీనివాసస్వామి తెలిపారు. మూడో తేదీన నృసింహ ఇష్టి, నాలుగున శ్రీయాగం, ఐదున సుదర్శన ఇష్టి, ఆరున విద్యాప్రాప్తికి హయగ్రీవ ఇష్టి, ఏడున తిరుకల్యాణోత్సవాన్ని దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

## ఘనంగా శివరామకృష్ణ ఆలయ వార్షికోత్సవం

పెదగంట్యాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డు పరిధి సీతానగరంలో శివరామకృష్ణ ఆలయ 11వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పరసలో ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి, మ్యాజిక్ షో, తదితర కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రతినిధులు నక్క దుర్గబాబు, పల్లా హరి, టీడీపీ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, గ్రామ పెద్దలు అప్పలనాయుడు, కనకరాజు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఓబీసీ సంఘం మహాజన సభ

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాలుగో సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు స్టీల్ క్లబ్‌లో నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు బి.అప్పారావు తెలిపారు. కొన్ని కీలక అంశాలపై చర్చించడంతో పాటు పలు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

# మహాశివరాత్రి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు


ఉత్సవాలకు సిద్ధమైన మాధవధార గాంధీనగర్ ఆలయం


స్ఫటిక లింగాకారంలో శివయ్య


విద్యుత్ కాంతులలో నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం

మాధవధార/సీతమ్మధార, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి); మహా శివరాత్రి ఉత్సవ నిర్వహణకు విశాఖ ఉత్తర నియోజకవర్గ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాల్లో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మాధవధార కొండపైకి సుమారు 150 ఏళ్ల క్రితం నాటి శ్రీభ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో శివరాత్రి పర్వదినం రోజున వేలాదిగా జనం చేరుకుంటారు. కొండపైన అనుకూలంగా ఉండటంతో అక్కడే ఆలయ సందర్శనాల తర్వాత జాగరణ, మరునటి రోజు జలధారల్లో పుణ్య స్నానాలు ఆచరిస్తారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజాభిషేకాలు, రాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకాలు జరపనున్నట్లు అర్చకుడు శ్రీనివాస శర్మ తెలిపారు. మాధవధార గాంధీనగర్‌లోని హరిహర క్షేత్రంలోని శివ సన్నిధిలో భక్తులు తమ స్వహస్తాలతో స్ఫటిక లింగాన్ని పాలు, నీళ్లతో అభిషేకం చేసుకునే అవకాశం కల్పించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం గ్రామంలో తీర్థ మహోత్సవం చేపడతారు. బుధవారం రాత్రి భస్మాభిషేకంతో లింగోద్భవ పూజాకార్యక్రమాలు జరుగుతాయి. జాతీయ రహదారి పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, బర్మాక్యాంప్ శివాలయాల్లో మహా శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. నక్కవానిపాలెంలో అత్యంత భక్తిశ్రద్ధలు, విశ్వాసంతో పూజించే ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయాన్ని మహాశివ రాత్రి పూజల కోసం విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. బుధవారం ప్రాతఃకాల సమయం నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తూ ఏకవార అభిషేకాలు, రాత్రి లింగోద్భవ సమయంలో సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, నీరాజనం, తీర్థ ప్రసాద వితరణ జరుపుతారు. సీతంపేట గణేష్ నగర్‌లోని పార్వతీశ్వరాలయంలో మహాశివరాత్రి పూజలకు దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి భక్తులకు దర్శనం, గోత్రనామాలతో అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు భాస్కర శర్మ, శివాజి శర్మలు తెలిపారు. రాత్రి లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకాలు చేస్తామన్నారు.


సీతంపేట గణేష్‌నగర్‌లో పార్వతీశ్వరాలయం

## చురుగ్గా జోన్ కార్యాలయ భవన నిర్మాణం

▸▸ త్వరలో జ్ఞానాపురం నుంచి మాధవధారకు మార్పు


మాధవధార ఉడాకాలనీలో నిర్మాణంలో ఉన్న జీవీఎంసీ జోనల్ కార్యాలయం

మురళీనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5 (జ్ఞానాపురం) కార్యాలయం కొద్ది నెలల్లోనే మాధవధార ఉడాకాలనీకి తరలి రానుంది. గతేడాది ఎన్నికలకు ముందు మార్చి నెలలో ఆరంభమైన పనులు ప్రస్తుతం ఊపందుకున్నాయి. రూ.2 కోట్ల ప్రాథమిక అంచనాతో కొత్త కార్యాలయ నిర్మాణాన్ని ఆరంభించారు. జి ప్లస్ 3 భవన సముదాయంగా కొత్త కార్యాలయాన్ని దాదాపు 800 గజాల ప్రభుత్వ స్థలంలో కడుతున్నారు. జోన్-5 ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో జరుగుతున్న పనులు ఇప్పుడు స్లాబ్ దశ దాటాయి. సెల్లార్‌లో విశాలమైన పార్కింగ్ సదుపాయం ఉంచారు. పైన మూడు అంతస్థులు రూపుదిద్దు కుంటున్నాయి. అధునాతన వసతులతో మాధవధార హైవే సమీపంలో జీవీఎంసీ పంప్‌హౌస్ పక్కనే రూపుదిద్దుకుంటోంది. దీనికి తొలుత కేటాయించిన నిధులు చాలవని భావించిన అధికారులు ఒక స్లాబు తగ్గించి పనులు పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఉన్నతాధికారులనిర్ణయం తీసుకుని కొత్త భవనాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు జోరుగా పనులు సాగిస్తున్నారు.

## సింహాచలేశునికి స్వర్ణ తులసీ దళార్చన



సింహాచలం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామికి స్వర్ణ తులసీ దళార్చనను వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా ప్రతినెలా ఏకాదశి రోజుల్లో స్వర్ణ తులసీ దళార్చన చేస్తారు. ఇందులో భాగంగా సోమవారం వేకువజామున స్వామివారికి ప్రభాత ఆరాధనలను యథావిధిగా పూర్తి చేశాక స్వర్ణ తులసీ దళాలతో బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలా దేవీల సమేతంగా ప్రత్యేక వేదికపై అధిష్టింపజేసి నారసింహ అష్టోత్తర శతనామావళిని (108) పఠిస్తూ స్వర్ణ తులసీ దళాలతో అర్చన జరిపారు. అనంతరం భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

## శాస్త్రోక్తంగా ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం


అలంకారంలో మహాశివుడు

సీతమ్మధార, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉదయం నుంచి మహాశివలింగానికి, పార్వతీదేవికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామారావు శర్మ, ఉర్జి మహేష్ శర్మలు పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పల్లకిపై శివపార్వతుల ఉత్సవమూర్తులను గ్రామవీధుల్లో ఊరేగించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. నరసింహనగర్, గ్రీన్‌పార్క్, పద్మశ్రీ ఆసుపత్రి ఏరియా, శంకరమఠం రోడ్డు, బాలయ్య శాస్త్రి లేఅవుట్, గణేష్‌నగర్, అండమాన్ గెస్ట్‌హౌస్ ఏరియాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా రమణికుమారి

మురళీనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా మాధవధార ఉడాకాలనీకి చెందిన పేడాడ రమణికుమారి నియమితులయ్యారు. కళింగ సామాజిక వర్గానికి చెందిన ఆమె పార్టీలో సీనియర్ నాయకురాలు. సోమవారం నియామక ఉత్తర్వులు అందుకున్న ఆమె పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.అమర్‌నాథ్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఇతర పార్టీ ప్రముఖుల్ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.



## 'సమర్థుడికే ఓటెయ్యండి'

మాధవధార, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమర్థుడైన వ్యక్తికే పట్టం కట్టాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు ఉపాధ్యాయులకు సూచించారు. మీడియాతో మాట్లాడిన ఆయన విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాడ గలిగే వ్యక్తినే ప్రోత్సహించాలని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకే కాకుండా, ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే టీచర్లకు కూడా ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరయ్యేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. సీపీఎస్ రద్దు, బోధన స్వేచ్ఛ, తెలుగు మీడియం అమలుపై బలంగా పోరాడగలిగే వ్యక్తే మండలిలో ఉండేలా ఉపాధ్యాయులంతా బాధ్యతాయుతంగా 27న జరిగే ఎన్నికల్లో ఓటుతో తీర్పు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# వైభవంగా దుర్గాలమ్మ అమ్మవారి దీపోత్సవం


అలంకరణలో దుర్గాలమ్మ అమ్మవారు


ఆలయం ఎదుట దీపాలు వెలిగించిన భక్తులు

మహారాణిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్ సమీపంలోని దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి జాతర మహోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి ఆలయం వద్ద నేత్రపర్వంగా దీపాలంకరణ జరిగింది. దీక్షలు చేపట్టిన మహిళలు పెద్ద సంఖ్యలో విచ్చేసి దీపాలు వెలిగించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. దుర్గాలమ్మ అమ్మవారు సౌభాగ్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం జరుగుతుంది. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచే కుంకుమార్చనలు, దర్శనాలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. శూలాల పండుగ, అగ్నిగుండాలు తొక్కే కార్యక్రమం ఉంటాయని, రాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం, 27న అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహిస్తామన్నారు. భక్తులు ఘటాలతో వచ్చి మొక్కుబడులు చెల్లించుకుంటారని తెలిపారు, మార్చి 6న నిర్వహించే మారు వారం పండుగతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈవో పైలా శేఖర్ బాబు తెలిపారు. గత కొద్దిరోజులుగా వివిధ అలంకారాలలో దర్శనమిచ్చిన అమ్మవారిని అనేకమంది వచ్చి భక్తితో కొలిచి కానుకలు సమర్పించారు.

## మాధవధారలో దుర్గాదేవి పండుగ మహోత్సవం


అన్న సమారాధనలో పాల్గొన్న కార్పొరేటర్ ఆర్..వెంకటరమణ

మాధవధార, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మాధవధార మహత్ కాలనీలో వేంచేసి ఉన్న గ్రామదేవత దుర్గాదేవి వార్షిక పండుగ మహోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అమ్మవారికి అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో అతిథిగా హాజరైన 51వవార్డు కార్పొరేటర్ ఆర్.వెంకటరమణ అమ్మవారి సన్నిధిలో పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఆరంభించి, భక్తులకు స్థానికులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. వేడుకల నిర్వహణలో మహత్‌కాలనీ పెద్దలు, మహిళలు, కమిటీ కార్యవర్గం హాజరయ్యారు.

## విధులు వదిలేసి...! రోడ్డుకు అడ్డంగా కాసి...!!

... 5వ పేజీ తరువాయి

చెక్ చేస్తున్నారు. చలాన్‌లు పెండింగ్‌లో లేకపోతే వారిని...ఇక వెళ్లిపోవచ్చునంటూ పంపిస్తున్నారు. గత ఏడాది జూలై కంటే ముందు పోలీసులు జారీచేసిన ఈ-చలాన్‌లన్నీ సాంకేతిక కారణాలతో డిలీట్ అయిపోయాయి. ఆ తర్వాత ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనలకు సంబంధించి పోలీసులు సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీసిన వారికి మాత్రమే ఈ-చలాన్‌లు జారీ అయ్యాయి. దీనివల్ల పెండింగ్ చలాన్‌లు ఉన్న వాహనాలు 20 శాతంలోపే ఉంటాయని పోలీసు అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ ఇరవై శాతం వాహనాలను గుర్తించేందుకు అన్ని వాహనాలను కూడళ్ల వద్ద నిలిపేయడం వల్ల వాహన చోదకులు ఇబ్బందిపడాల్సి వస్తోంది. ఈ క్రమంలో మద్దిలపాలెం జంక్షన్, గొల్లలపాలెం జంక్షన్, గురుద్వార జంక్షన్, అక్కయ్యపాలెం జంక్షన్ వంటి ప్రాంతాల్లో పోలీసులతో తరచూ వాహన చోదకులు వాగ్వాదానికి దిగుతున్నారు. దీనిపై సీపీ శంఖబ్రతబాగ్చి దృష్టిసారించి పెండింగ్ చలాన్‌లు వసూలు చేసేందుకు మెరుగైన మార్గాన్ని సిబ్బందికి సూచించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

# రుగ్వేదానికి విశిష్ట స్థానం


ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సీతంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మార్క్సిస్టు అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం కన్నడ మూలం డాక్టర్ జి.రామకృష్ణ రాసిన 'రుగ్వేద యథార్థ దర్శనం, బీటలు వారిన స్వేచ్ఛ, వాడూ...నేనూ నవల పుస్తకావిష్కరణలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, రచయిత కల్యాణ రామారావు, రచయిత మందల పర్తి కిషోర్‌లు విచ్చేశారు. వక్తగా విచ్చేసిన ఆచార్య జి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ మౌలిక సాహిత్యంలో రుగ్వేదానికి విశిష్ట స్థానం ఉందన్నారు. బీటలు వారిన స్వేచ్ఛ అనువదించిన రచయిత పద్మజ షా మాట్లాడుతూ కూడూ, గూడూ, నీడా మనిషి స్వేచ్ఛకు సంబంధించిన త్రిముఖ పార్శ్వాలని, అవి మనిషి మనుగడకు అవసరమైనవన్నారు. వాడు.. నేను రచయిత వివిన మూర్తి పుస్తక విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మార్క్సిస్టు అధ్యయన కేంద్రం నిర్వాహకులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఎన్.అంజయ్య, కె.ఎస్.మల్లీశ్వరి, కె.మురళి, జి.ఎస్.రాంమోహన్, మాజీ శాసన సభ్యులు మానం ఆంజనేయులు, ఆచార్య గాయత్రి, ఎ.వనజ, కత్తి పద్మ, డి.లలిత, ఎస్.గోవిందరాజులు, ఎంఎస్ పట్నాయక్, సాహితీప్రియులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు అధికారుల కేటాయింపు

మహారాణిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి సోమవారం రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. జిల్లాలోని 13 పోలింగ్ కేంద్రాలకు పీవో, ఏపీవో, ఓపీవోలను కేటాయిస్తూ కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ నిర్ణయం తీసుకున్నారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కేంద్రం నుంచి 13 మంది ఏపీవోలు, 13 మంది పీవోలు, 26 మంది ఓపీవోలను కేటాయించారు. అదనంగా 10 మంది సిబ్బందిని కేటాయించారు. అందరికీ అధికార పత్రాలను అందించారు. డీఆర్వో భవానీశంకర్, నోడల్ అధికారి సుధాసాగర్ ఆధ్వర్యంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

## జిల్లాలో 28 వరకు ఆధార్ క్యాంపులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యం కోసం ఈ నెల 28 వరకు జిల్లాలో పలుచోట్ల ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో ఉన్న సేవలు కాకుండా, కామన్ సర్వీస్ సెంటర్, పోస్టాఫీసు ద్వారా ఈ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు, ఐదేళ్ల నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పిల్లలు ఆధార్ అప్‌డేట్, బయోమెట్రిక్ అప్‌డేట్, ఫోన్ నంబర్లు, ఇంటి చిరునామాల మార్పు, పేర్లు, పుట్టిన తేదీల్లో సవరణలు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## హోరా హోరీగా ఎమ్మెల్సీ పోరు

... 5వ పేజీ తరువాయి

48 గంటల ముందు అంటే మంగళవారం సాయంత్రం నాలుగు గంటలతో ప్రచారం ముగియనున్నది. జిల్లా కేంద్రాలకు బ్యాలెట్ పత్రాలు నాలుగు రోజుల క్రితమే చేరాయి. పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తిచేయడంతోపాటు సోమవారం ర్యాండమైజేషన్ నిర్వహించారు. బుధవారం సాయంత్రానికల్లా సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా ఏర్పాట్లుచేశారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహణకు పోలీసుల బందోబస్తు ఏర్పాటుచేశారు. ఓట్ల లెక్కింపు వచ్చే నెల మూడో తేదీన జరగనున్నది.

## రవాణా, ట్రాఫిక్ వ్యవస్థల మెరుగుకు ఉమ్మా

... 5వ పేజీ తరువాయి

తప్ప అక్కడకు చేరుకునే మార్గం లేదు. గంటలో చేరాల్సిన సమయం అంతకు రెట్టింపుగా ఉంటోంది. ఈ సమస్యల పరిష్కారానికి పోలీస్, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, హైవే అథారిటీ...ఎవరికి వారు కాకుండా సంబంధిత సంస్థలన్నీ ఒక గొడుగు కింద పనిచేస్తే బాగుంటుందని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ప్రభుత్వానికి లేఖ రాయగా దానిని పరిశీలించి ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఉమ్టా ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. దీనికి కమిటీని ఏర్పాటుచేసింది. పురపాలన పట్టణాభివృద్ధి సంస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో ఆర్థిక శాఖ సెక్రటరీ, వీఎంఆర్‌డీఏ కమిషనర్, విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల కలెక్టర్లు, ఈపీడీసీఎల్ సీఎండీ, జీవీఎంసీ కమిషనర్, విశాఖ సిటీ పోలీస్ కమిషనర్, విజయనగరం మునిసిపల్ కమిషనర్, ఎలమంచిలి మునిసిపల్ కమిషనర్, నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్, ఏపీఎస్ఆర్‌టీసీ ఎండీ, వాల్తేరు డీఆర్ఎం, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సెక్రటరీ, రవాణా శాఖ కమిషనర్, మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీలను సభ్యులుగా, ఏయూ, జేఎన్‌టీయూ, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీల నుంచి ఒక్కొక్కరు చొప్పున ముగ్గురిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరంతా వీఎంఆర్‌డీఏ పరిధిలో ఏకీకృత రవాణా వ్యవస్థ ఏర్పాటుకు యత్నిస్తారు.

## పల్సస్ ఉద్యోగుల ఆందోళన

... 5వ పేజీ తరువాయి

తమనే రెండు వేల రూపాయలు కట్టాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారన్నారు. ఉద్యోగుల ఆందోళన గురించి సమాచారం అందడంతో పోతినమల్లయ్యపాలెం సీఐ బాలకృష్ణ, ఎస్ఐ కె.భాస్కరరావులు కంపెనీ వద్దకు చేరుకున్నారు. యాజమాన్యానికి, ఉద్యోగులకు మధ్య చర్చల కోసం విఫలయత్నం చేశారు. అయితే యాజమాన్యం దిగిరాకపోయేసరికి ఉద్యోగులు ఆందోళన ఉధృతం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. పల్సస్‌లో సుమారు 352 మంది పనిచేస్తున్నారు. వీరికి సంస్థ రూ.18 వేలు నుంచి రూ.21 వేలు చెల్లించాల్సి ఉంది. కానీ సక్రమంగా ఇవ్వడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు. ఈ కంపెనీకి సీఈవోగా గేదెల శ్రీనుబాబు, ఎండీగా శంకర్ వ్యవహరిస్తున్నారు.

# రఘువర్మకు మద్దతు కోరుతూ టీడీపీ నేతల ప్రచారం


ఉపాధ్యాయులను కలిసిన టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, ఇతర నాయకులు

అక్కయ్యపాలెం/కంచరపాలెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీలు బలపరచిన ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ కోరారు. స్థానిక కూటమి నాయకులతో కలిసి 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని కేఎన్ఎం బాలికల ఉన్నత పాఠశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థించారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మను గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు అకిరెడ్డి జగదీష్, కన్నం వెంకట రమణారావు, ముక్కి రామకృష్ణ, ముప్పాళ్ళ శ్రీకృష్ణ, దువ్వి కాశీప్రసాద్, ఎంఎల్ఎస్ రావు, గట్టు సీత, మాలతి, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. గ్రేటర్ 43వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహనరావు, శ్రీదేవి ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలోని పాఠశాలల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. అపుస్మా అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, జోనల్ అధ్యక్షుడు ఎంవీరావు, డాక్టర్ సుంక శ్రీనివాసరావు, యు.సురేష్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు. ఉత్తర టీడీపీ నాయకులు సోమవారం 54వ వార్డులో విస్తృత ప్రచారం నిర్వహించారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు కుప్పా కార్తీక్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు గొర్లె అప్పారావు, వెల్లంకి భరత్, పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు. కంచరపాలెం, మర్రిపాలెం ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. రఘువర్మకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు ఉప్పాడ శేఖర్, పీల రమణ, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## అధికార అండతో అక్రమ నిర్మాణం!

... 5వ పేజీ తరువాయి

విరుద్ధంగా బహుళ అంతస్థుల భవనం నిర్మిస్తున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే....జీవీఎంసీ 67వ వార్డు పరిధిలోని పంతులుగారి మేడ ప్రాంతంలో జాతీయ రహదారి పక్కనే ప్రజా ప్రతినిధి సోదరి భారీ భవనం నిర్మిస్తున్నారు. నిర్మాణ అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో నామమాత్రపు ఫీజు చెల్లించారు. ఈ క్రమంలో వచ్చిన బీపీ నంబర్ చూపించి ఇప్పటికే నాలుగు అంతస్థుల భవనం నిర్మించి ఓ ప్రైవేటు సంస్థకు అద్దెకు ఇచ్చారు. గత పది రోజులుగా ఐదో అంతస్థు నిర్మాణానికి పనులు చేపట్టారు. ప్లాన్ అప్రూవల్ కోసం స్థలం ఉన్నదాని కంటే ఎక్కువ విస్తీర్ణం చూపించారనే ఆరోపణ కూడా ఉంది. వాస్తవానికి రహదారి సౌకర్యం, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆ భవన నిర్మాణానికి టౌన్‌ప్లానింగ్ విభాగం అనుమతులు నిరాకరించినట్టు తెలిసింది. అయినప్పటికీ పట్టించుకోకుండా నిర్మాణం కొనసాగిస్తున్నారు. ఈ విషయమై టౌన్‌ప్లానింగ్ విభాగం ఏసీపీ వెంకటరావును వివరణ కోరగా భవనాన్ని పరిశీలించి నిబంధనలను అతిక్రమించినట్టయితే చర్యలు తీసుకుంటామన్నారు.

## 28 వరకు ఆధార్ క్యాంపులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యం కోసం ఈనెల 28వ తేదీ వరకు జిల్లాలో పలుచోట్ల ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో ఉన్న సేవలు కాకుండా కామన్ సర్వీస్ సెంటర్, పోస్టాఫీసు ద్వారా ఈ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు ఆధార్ నమోదు, ఐదేళ్ల నుంచి 15 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలు ఆధార్, బయోమెట్రిక్ అప్‌డేట్, ఫోన్లు నంబర్లు, ఇంటి చిరునామాల మార్పు, పేర్లు, పుట్టిన తేదీల్లో సవరణల కోసం వినియోగించుకోవాలన్నారు.

## ఎన్నికల విధులకు అధికారుల కేటాయింపు

మహారాణిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి సోమవారం రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయింది. జిల్లాలోని 13 పోలింగ్ కేంద్రాలకు పీవో, ఏపీవో, ఓపీవోలను కేటాయిస్తూ కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ నిర్ణయం తీసుకున్నారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కేంద్రం నుంచి 13 మంది ఏపీవోలు, 13 మంది పీవోలు, 26 మంది ఓపీవోలను కేటాయించారు. అదనంగా 10 మంది సిబ్బందిని కేటాయించారు. డీఆర్వో భవానీశంకర్, నోడల్ అధికారి సుధాసాగర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

## బీఆర్‌టీఎస్ రోడ్డులో చీకట్లు

ఆరిలోవ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): హనుమంతవాక కూడలి నుంచి పెదగదిలి కూడలి వరకు గల బీఆర్‌టీఎస్ రోడ్లపై చీకట్లు రాజ్యమేలుతున్నాయి. రెండు రోజుల నుంచి వీధి దీపాలు వెలగడం లేదు. ప్రతీ మూడు స్తంభాలకు ఒకచోట వీధి దీపం వెలుగుతుంది. చీకటిగా ఉండడంతో బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఒక వరుసలో మాత్రమే వెలిగేవి. ఇప్పుడు వాహనాలు, బస్సులు తిరిగే రోడ్లలో వీధి దీపాలు వెలగడం లేదు. సాక్షాత్తూ నగర మేయర్ నివాసిత ప్రాంతంలోనే పరిస్థితి ఇలా ఉండడమేమిటని ప్రజలు విస్తుపోతున్నారు. సర్వీసు రోడ్లలో వీధి దీపాల పరిస్థితి ఇక చెప్పనవసరం లేదు.

## ఆటోనగర్‌లో ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ఆటోనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ ఎంఎస్ఎంఈ కార్యాలయం వద్ద రెండు రోజుల పాటు జరిగే వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కమ్ బయ్యర్ సెల్లర్ మీట్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌ను సోమవారం హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (మెటీరియల్స్) కె.తిరుమురుగన్, బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సత్యప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎంఎస్ఎంఈల ప్రయోజనాల కోసం వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ-డీఎఫ్‌వో కృషి అభినందనీయమన్నారు

## సినిమా గైడ్

- **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక),
- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)
- **తండేల్:** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 13, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 44, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 38, బీరకాయలు 64, ఆనపకాయ16, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 12, క్యారెట్ 34 దొండకాయలు 32, బంగాళదుంపలు 14, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 68, అల్లం 52, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్ధచిక్కుడు 26, దోసకాయలు 26, వెల్లుల్లి 100, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 32, కీరదోస 28, కాప్సికమ్ 40, పొట్లకాయ 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 40, గోరుచిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

| కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో) | |
|---|---|
| విశాఖపట్నం | 470 |
| విజయనగరం | 474 |
| శ్రీకాకుళం | 474 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 65 |
| లైవ్ ధర | 85 |
| విత్ స్కిన్ | 140 |
| స్కిన్‌లెస్ | 150 |



పెదగదిలి కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం





ఇసుకతోటలో వేడుకలకు సిద్ధమవుతున్న ఆలయం, వీరభద్రస్వామి విగ్రహం

# శివరాత్రికి సిద్ధమవుతున్న ఆలయాలు

ఆరిలోవ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ఆరిలోవ పరిధిలోని శివాలయాలు విద్యుత్ కాంతులతో ముస్తాబవుతున్నాయి. పెదగదిలి కాశీ అన్న పూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా సిద్ధం చేశారు. ఆరిలోవ ఆఖరి బస్టాప్ సమీపంలోని ద్వాదశ జ్యోతిర్లింగేశ్వరాలయం, చినగదిలి స్ఫటిక లింగేశ్వరస్వామి ఆలయం, ఆదర్శనగర్‌లోని జ్ఞానలింగేశ్వర ఆలయం, ఈశ్వరదేవినగర్ కాలనీలోని రామలింగేశ్వర ఆలయం, హనుమంతవాక జంక్షన్ కొండమీద శివాలయం, ఆరిలోవ డ్రైవర్స్ కాలనీలోని బాలాత్రిపుర సుందరీ సహిత మల్లేశ్వరస్వామి ఆలయాలు ప్రత్యేక పూజలకు సిద్ధమయ్యాయి. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు ఆలయాల్లో లింగోద్భవ కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. భక్తుల దర్శనాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

### ఏడాదికి ఒక్కసారే పూజలు!

**వెంకోజీపాలెం:** ఏడాది పొడవునా ఇటువైపు కన్నెత్తి చూడని భక్తులు మహాశివరాత్రి పర్వదినాన మాత్రమే సంబరంగా ఆ స్వామికి పూజలు చేస్తారు. ఇసుకతోటలోని వీరభద్రస్వామి ఆలయ ప్రత్యేకత ఇది. గౌరీదేవిగా కొలిచే రావిచెట్టు, ఈశ్వరునిగా భావించే జమ్మి చెట్టు కలిసి ఉన్న ఈ ప్రాంతంలో వీరభద్రస్వామిని అత్యంత భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. మేళతాళాల మధ్య వీరభద్రస్వామిని ఊరేగించి, అనంతరం భక్తుల గోత్రనామాలతో అభిషేకం చేస్తారు. చుట్టు పక్కల ప్రాంతాల మహిళలు ఉపవాసాలు ఉండి వీరభద్రస్వామిని కొలుస్తారు. మహాశివరాత్రి రోజున ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు పూజలు కొనసాగుతాయి. నిర్వాహకులు ఇప్పటికే ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేసి, రంగవల్లులతో తీర్చిదిద్దారు. 363 రోజులు చీకటిలో ఉండే ఈ ఆలయం, మహాశివరాత్రి పర్వదినం రెండు రోజులు విద్యుత్ కాంతులతో మెరిసిపోతుంది. మద్దిలపాలెంలోని అచ్చి అప్పలరెడ్డి కుటుంబంలో జన్మించిన వీరభద్రస్వామి వివాహం కాకుండానే మృతి చెందడం, అప్పటి నుంచి వీరభద్రుడిగా తన కుటుంబీకులకు దర్శనమివ్వడంతో ఆరు దశాబ్దాల క్రితం ఇక్కడొక ఆలయాన్ని నిర్మించుకున్నారని స్థానికులు చెబుతుంటారు. తల్లి అచ్చి అప్పయ్యమ్మ మరణించడంతో వీరభద్రస్వామి సోదరుడు అచ్చి మహావిష్ణువు ఏటా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు.

## ఖైదీల్లో పరివర్తన తేచ్చే అంశాలపై శిక్షణ



తమిళనాడు ట్రైనీ అధికారులకు శిక్షణ ఇస్తున్న జైలు సూపరింటెండెంట్ మహేశ్

ఆరిలోవ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఖైదీలతో ఎలా మెలగాలి? వారి ప్రవర్తనలో మార్పు తేవడానికి ఎలాంటి సూచనలు ఇవ్వాలి అనే అంశాలపై జిల్లా జైలు సూపరింటెండెంట్ ఎం.మహేశ్ ట్రైనీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. తమిళనాడులోని వల్లూరు జైలు అకాడమీ నుంచి సుమారు 39 మంది ట్రైనీ అధికారులు సోమవారం విశాఖ కేంద్ర కారాగారానికి వచ్చారు. వీరికి సూపరింటెండెంట్ మహేశ్ పలు సూచనలు చేశారు. ఖైదీల ఉపాధికి ఎలాంటి శిక్షణ ఇవ్వాలో తెలియజేశారు. రక్షణపరంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలి? ఖైదీలకు ఉన్నత చదువులపై ఆసక్తి కలిగించడానికి ఎలా మార్గదర్శకంగా వ్యవహరించాలి? తదితర అంశాలపై విపులంగా వివరించారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు అనుకోకుండా ఏదైనా సంఘటన జరిగితే ఎలాంటి నిర్ణయం తీసుకోవాలి? అనే అంశాలపైన సూచనలు చేశారు. ఖైదీలను మంచి వారిగా తీర్చిదిద్ది సమాజానికి పంపించే బాధ్యత అందరిపై ఉందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు సాయి ప్రవీణ్, జవహర్‌బాబు, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మృతదేహంతో పోలీస్ స్టేషన్ వద్ద నిరసన



మృతదేహం ఉన్న వాహనంతో నిరసన తెలుపుతున్న మృతుడి కుటుంబ సభ్యులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆయన కుటుంబీకులు మృతదేహాన్ని పోలీస్ స్టేషన్ బయట ఉంచి నిరసన చేపట్టారు. ఇక్కడి ఇందిరానగర్‌కు చెందిన సోమేశ్ అనే ఆటోడ్రైవర్ తన పర్స్ పోయిందని అదే ప్రాంతానికి చెందిన రౌతు ఆనంద్ (33), నాగరాజు అనే వ్యక్తులపై ఈ నెల 21న గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఆనంద్, నాగరాజులను స్టేషన్‌కు పిలిచి విచారిస్తున్నారు. అయితే దొంతనం కేసులో తనను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించడంతో మనస్తాపానికి గురైన ఆనంద్ ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆనంద్ ఆత్మహత్యకు పోలీసులే కారణమంటూ కుటుంబ సభ్యులు మృతదేహంతో స్టేషన్ వద్దకు వచ్చి నిరసనకు దిగారు. సోమవారం కేజీహెచ్ నుంచి ఆనంద్ మృతదేహాన్ని తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులు పోలీస్ స్టేషన్ బయట మృతదేహాన్ని ఉంచి సాయంత్రం వరకు నిరసన తెలిపారు. దీంతో సీఐ అప్పారావు మృతుని కుటుంబీకులతో మాట్లాడి ఘటనపై విచారణ జరిపించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో సాయంత్రం ఆరు గంటలకు మృతదేహాన్ని తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

# కొనుగోలుదారుల నుంచి బకాయిలు వసూలు చేయాలి

» అధికారులకు వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గృహసముదాయాలకు సంబంధించి ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను కొనుగోలుదారుల నుంచి వసూలు చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో పరిపాలనా విభాగానికి సంబంధించిన అధికారుల, సిబ్బందితో సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గొల్లలపాలెం, పెదగంట్యాడ, అనకాపల్లి, బాలచెరువు, సీతమ్మధార, నెహ్రూనగర్, సాగర్‌నగర్, వెంకోజీపాలెం, సింహపురి, కనపాక, అయ్యన్నపేట తదితర ప్రాంతాల్లో నిర్మించిన గృహసముదాయాలకు సంబంధించి కొనుగోలుదారుల నుంచి బకాయిలు వసూలు చేయాలన్నారు. తదుపరి రిజిస్ట్రేషన్లు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల నిర్వహించి వేలంపాటలో స్థలాలు కొనుగోలు చేసిన వారి నుంచి కూడా బకాయిలు వసూలు చేయాలన్నారు. దుకాణదారుల నుంచి సకాలంలో బకాయిలు వసూలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సంస్థకు సంబంధించిన వాణిజ్య సముదాయాలు, పార్కుల్లోను నిర్వహణ పనులు క్షుణ్ణంగా పరిశీలించిన మీదట అంచనాలు రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, ముఖ్య గణాంక అధికారి హరిప్రసాద్, పర్యవేక్షక ఇంజనీర్ భవానీ శంకర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్రంపాలెంలో ఆగని అక్రమ మైనింగ్

» వారం రోజులుగా రాత్రిపూట తవ్వకాలు

» పట్టించుకోని గనుల శాఖ, విజిలెన్స్ అధికారులు



గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌కు అనుకుని ఉన్న కొండలో అక్రమ మైనింగ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌కు అనుకుని ఉన్న కొండలను కొంతమంది యథేచ్ఛగా తవ్వుకుంటున్నారు. ప్రతి రోజు రాత్రి ఎనిమిది నుంచి తెల్లవారుజాము నాలుగు గంటల వరకు యంత్రాలతో తవ్వి రాయి, గ్రావెల్, మట్టి సమీపంలోని పారిశ్రామిక లేఅవుట్‌లో గల ప్లాట్లకు తరలిస్తున్నారు. తవ్వకాలకు గనుల శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవు. గతంలో అదే ప్రాంతంలో వందలాది లారీల గ్రావెల్ తవ్వినా గనుల శాఖ, గనుల శాఖ విజిలెన్స్ అధికారులు తూతూమంత్రంగా దాడులు చేసి నోటీసులు ఇచ్చారు తప్ప వారి నుంచి జరిమానా వసూలు చేయలేదు. దాంతో అక్రమార్కులు మరింత బరితెగించారు. ఈ వ్యవహారంలో గనుల శాఖ, గనుల శాఖ విజిలెన్స్‌లో కొందరు అధికారులు, సిబ్బంది ఒప్పందం కుదిరినట్టు ఆరోపణలున్నాయి. అందుకే స్థానికంగా ఎవరైనా ఫోన్ చేసినా పట్టించుకోకపోగా తిరిగి అక్రమార్కులను అప్రమత్తం చేస్తున్నారంటున్నారు. కాగా గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌లో ప్లాట్ల ఫిల్లింగ్‌కు అవసరమైన గ్రావెల్, మట్టి తరలింపు వెనుక కూటమి నేతల హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. కీలక వ్యక్తులకు లక్షల రూపాయల ముడుపులు అందాయంటున్నారు.

## స్టీల్‌ప్లాంటులో ఉద్యోగం పేరిట మోసం

» ఇంటక్ నాయకుడిని అరెస్టు చేసిన పోలీసులు

గాజువాక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తిని మోసగించిన ఇంటక్ ప్లాంట్ నాయకుడిని గాజువాక పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. ఇంటక్ ప్లాంట్ నాయకుడు కె.రమణ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి గత ఏడాది జూలైలో రూ.లక్షా 50 వేలు తీసుకున్నాడని, ఇప్పటివరకు ఉద్యోగం ఇప్పించలేదని విజయనగరం జిల్లా ఎల్.కోట ప్రాంతానికి చెందిన లెక్కల అనిల్ అనే వ్యక్తి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన రమణ సీఐ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దుర్భాషలాడాడు. దీంతో పోలీసులు రమణను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

## సాధారణ పరీక్షలతో కంటి క్యాన్సర్‌కు దూరం

» ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల డాక్టర్ లావణ్య

ఆరిలోవ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి సాధారణ కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ నుంచి కంటిని, ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుందని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల డాక్టర్ లావణ్య అన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో కంటి క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. శరీరంలో కంటికి అత్యంత ప్రాధాన్యముంటుందని, అందువల్ల దానిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కంటిలో చిన్న కణితులు ఏర్పడితే అవి క్యాన్సర్‌కి దారితీసి ప్రాణాలకే ముప్పు తీసుకురావచ్చని హెచ్చరించారు. ఇటువంటి కణితులు గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు. క్యాన్సర్ శరీరానికే కాకుండా కంటికి కూడా వస్తుందన్నారు. ఈ వ్యాధితో బాధపడుతున్న పిల్లల్లో అవగాహన కల్పించి, వారికి మంచి చూపును ప్రసాదించేందుకు మే లో వైట్‌థాన్ అనే వార్షిక పరుగు కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు.

# 'ఉపాధి' నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు





పద్మనాభంలో శ్మశానవాటికకు రోడ్డు వేయక ముందు ఇలా, అందుబాటులోకి వచ్చిన రహదారి

పద్మనాభం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోంది. ఈ మేరకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పల్లెపండగ కింద మండలానికి మంజూరైన నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయ్యే దశకు వచ్చాయి. ఈ నిధులతో నిర్మిస్తున్న రోడ్ల వలన ఇప్పటివరకు నిర్లక్ష్యానికి గురయిన రహదారులు కొత్తరూపు సంతరించుకుంటున్నాయి. ఇప్పటికే చాలా గ్రామాల్లో డ్రైనేజీలతో పాటు రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. మండలంలోని పద్మనాభం, రేవిడి, వెంకటాపురం, కొయ్యపేట, పాండ్రంగి తదితర గ్రామాల్లో నిర్మాణ పనులు జోరందుకున్నాయి. ఒక్కో రోడ్డుకు రూ.10 లక్షల నుంచ రూ.15లక్షల వరకు మంజూరు చేశారు. రేవిడిలో అన్నంపేట నుంచి కళ్లాలకు పెండింగ్‌లో ఉన్న రోడ్డుకు ఈ నిధులతో మోక్షం కలిగింది. పద్మనాభం గోస్తనీ నది సమీపంలో శ్మశానవాటికకు వెళ్లడానికి, రైతుల పొలాలకు చేరేందుకు అవసరమైన రహదారికి కూడా నిధులు మంజూరు కావడంతో రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. ఈ పనుల వలన గ్రామాల్లో మౌలిక వసతులు సమకూరుతున్నాయి.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు వ్యూహాలపై చర్చ



ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన పాకలపాటి రఘువర్మ విజయానికి శ్రేణులను సమాయత్తం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు ఎంవీపీకాలనీలోని గంటా నివాసానికి సోమవారం చేరుకున్న ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవితో గంటా సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రచారం, ఉపాధ్యాయుల మద్దతు, క్షేత్రస్థాయిలో పరిస్థితులను చిరంజీవి ఎమ్మెల్యేకు వివరించారు. అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తిగా రఘువర్మ అభ్యర్థిత్వం పట్ల ఉపాధ్యాయుల్లో సానుకూలత ఉందని ఈ సందర్భంగా గంటా అన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యారంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ఉపాధ్యాయులు స్వాగతిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఓటర్లను స్వయంగా కలిసి ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్న తీరును శ్రేణులంతా వివరించాలని గంటా సూచించారు.

## ర్యాపిడో బైక్‌ను ఢీకొన్న కారు

» అపస్మారక స్థితిలో ఐటీ ఉద్యోగిని

» మరొకరికి తీవ్ర గాయాలు





అపస్మారక స్థితిలో జోతిర్మయి, తీవ్ర గాయాలతో బైక్ డ్రైవర్

సాగర్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్ రోడ్డు ఐటీ జంక్షన్ కూడలి సమీపంలో సోమవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఐటీ ఉద్యోగినికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నారు. అలాగే ర్యాపిడో బైక్ డ్రైవర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ ప్రమాదంలో పెదగంట్యాడ వుడా కాలనీ సమీపంలోని వినాయకనగర్‌కు చెందిన గునిశెట్టి జ్యోతిర్మయి (33) అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఆమె బెంగళూరులోని ఇన్ఫోసిస్ సంస్థలో పదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అనివార్య కారణాల వల్ల ఆమె విశాఖలో ఉండాల్సి రావడంతో రుషికొండ ఐటీ హిల్స్‌లో ఉన్న ఇన్ఫోసిస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో విధులు ముగించుకుని తిరిగి నగరంలోకి వచ్చేందుకు గాను ర్యాపిడో బుక్ చేసుకుని బైకుపై బయలుదేరారు. ఈ క్రమంలో ఐటీ కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా తిమ్మాపురం వైపు వెళ్తున్న ఓ కారు వేగంగా వచ్చి బైకును ఢీకొంది. దీంతో బైకు వంద మీటర్ల దూరం ఎగిరిపడింది. దీంతో తీవ్ర గాయాలకు గురైన జ్యోతిర్మయిని, ర్యాపిడో డ్రైవర్‌ను ఎస్ఐ కె.భాస్కర్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బైకు డ్రైవర్ పేరు, ఇతర వివరాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నన్ను చంపేయమనండి...లేకపోతే నేనే చంపేస్తా

» స్పీకర్ అయ్యన్నపాత్రుడును ఉద్దేశించి వైసీపీ నేత కర్రి శ్రీనివాసరావు అభ్యంతరకర వ్యాఖ్యలు



కర్రి శ్రీనివాసరావు

నర్సీపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'నా కుటుంబాన్ని ఎందుకు బాధ పెడతారు...నన్ను చంపేయమనండి, లేదంటే నేనే ఆయన్ని చంపేస్తాను...' అంటూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును ఉద్దేశించి వైసీపీ నాయకుడు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు అభ్యంతకర వ్యాఖ్యలు చేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం శారదా నగర్‌లో కర్రి శ్రీనివాసరావు సోదరుడు సత్యనారాయణ ప్రభుత్వ స్థలంలో భవనం నిర్మించారని రెవెన్యూ అధికారులు సోమవారం తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తాము ఎవరి వద్ద కొన్నామో...ఆమె భవనాన్ని ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నించారు. ఆ భవనాన్ని కూల్చేసి, తరువాత తమ భవనం వద్దకు రావాలన్నారు. స్పీకర్ కుర్చీలో కూర్చుని మాట్లాడడం కాదు...దమ్ముంటే ఇక్కడకు వచ్చి మాట్లాడాలని సవాల్ చేశారు. తనపై కక్షతో తన కుటుంబాన్ని రోడ్డు మీదకు లాగాలని చూస్తున్నారని ఆరోపించారు.

## అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన




ఆధ్యాత్మిక నాటక ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. వయసుకు మించి వారు ప్రదర్శించిన హావభావాలు ఆశ్చర్యపరిచాయి. ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి విద్యా విహార్‌లో సోమవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో వివిధ అంశాలకు సంబంధించి కిండర్ గార్డెన్ విద్యార్థుల ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు బహుమతులను అందజేశారు. బాలల ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బయో డైవర్సిటీ పార్కులో రష్యన్లు



అరుదైన మొక్కను చూస్తున్న రష్యన్ పర్యాటకులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పెదవాల్తేరులోని రాణీ చంద్రమణీ దేవి ఆస్పత్రి ఆవరణలో గల బయో డైవర్సిటీ పార్కును సోమవారం రష్యన్ పర్యాటకులు సందర్శించారు. ఈ సందర్భంగా పార్క్‌లో వికసించిన ఫాలెనోఫ్సిస్‌ను, సాధారణంగా హోలీక్రాస్, ఈస్టర్ ఫ్రూట్స్, కాలాబాష్ ట్రీ అని పిలిచే క్రెసెంటియా కుజెటే అనే మొక్కలను పరిశీలించారు. పార్కు ఆహ్లాదకరంగా ఉందని, అరుదైన జాతి మొక్కలకు ఆలవాలంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. వివిధ రకాల మొక్కలు, వాటి విశిష్టతను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

## వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా రమణికుమారి



పేడాడ రమణికుమారి

మురళీనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా మాధవధార ఉడాకాలనీకి చెందిన పేడాడ రమణికుమారి నియమితులయ్యారు. కళింగ సామాజిక వర్గానికి చెందిన ఆమె పార్టీలో సీనియర్ నాయకురాలు. సోమవారం నియామక ఉత్తర్వులు అందుకున్న ఆమె పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.అమర్‌నాథ్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఇతర పార్టీ ప్రముఖుల్ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.



# సోమేశ్వరా.. నమో నమః

» మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన అప్పికొండ సోమేశ్వరాలయం
» భక్తుల కోసం మౌలిక వసతులు కల్పిస్తున్న అధికారులు
» భారీ పోలీస్ బందోబస్తు, తీరంలో గజ ఈతగాళ్ల ఏర్పాటు
» ప్రత్యేక బస్సులు నడపనున్న ఆర్టీసీ

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):

**అతి పురాతన దేవాలయాల్లో ఒకటైన అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ప్రాచీన చరిత్ర కలిగిన సోమేశ్వరాలయంలో మహా శివరాత్రి పర్వదినాన జాగరణ చేస్తే అంతా శుభం కలుగుతుందన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఏటా మహా శివరాత్రి నాడు సోమేశ్వరాలయానికి భారీ ఎత్తున భక్తులు తరలివస్తారు. కాగా గతంలో కంటే ఈ ఏడాది భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం వుందని ఆలయ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం వద్ద జాగరణ చేసి వేకువజామున సముద్ర స్నానమాచరించి స్వామిని దర్శించుకుని భక్తులు తరిస్తుంటారు. పారిశ్రామిక ప్రాంతం, విశాఖ నగరం, రూరల్, తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఇక్కడకు రానున్నందున అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.**

### 1,400 ఏళ్ల చరిత్ర..

దేశంలోనే అతి పురాతన దేవాలయాల్లో మూడోదిగా గుర్తించబడిన సోమేశ్వరస్వామి ఆలయానికి 1,400 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పికొండ సముద్ర తీరాన ఉన్న ఈ ఆలయం 6,8,10 శతాబ్దాల కాలం నాటిదిగా శాసనాలను బట్టి స్పష్టమవుతుంది. పురాతనమైన కాశీ, రామేశ్వర దేవాలయాలతో పాటు అప్పికొండ సోమేశ్వరాలయానికి కూడా అత్యంత గుర్తింపు ఉంది. అందుకే మహా శివరాత్రి రోజున ఇక్కడి ఆలయంలో జాగరణ చేసి సోమేశ్వరుడ్ని దర్శించుకుంటే అంతా శుభం చేకూరుతుందని భక్తులు తరలివస్తారు.

### నాడు అప్పుకొండ.. నేటి అప్పికొండ

సముద్ర తీరాన కపిల మహర్షి 101 శివలింగాలను ప్రతిష్ఠించాలని సంకల్పించారు. అయితే వంద శివ లింగాలను ప్రతిష్ఠించి ఒక లింగాన్ని ఆయన ప్రతిష్ఠించలేకపోయారు. దీంతో శివుడికి ఒక లింగం అప్పుగా మిగిలిపోయిందని శిలాశాసనాలను బట్టి స్పష్టమవుతుంది. దీంతో ఈ ప్రాంతాన్ని అప్పట్లో అప్పుకొండగా పిలిచేవారు. కాలక్రమేణా అప్పుకొండను కాస్తా అప్పికొండగా పిలవడంతో ప్రస్తుతం అప్పికొండ సోమేశ్వరాలయంగా అందరూ పిలుస్తుంటారు. కాగా ప్రస్తుతం ఉన్న సోమేశ్వరాలయం మొత్తం ఇసుకమేటలతో కప్పి ఉండడంతో 70, 80 ఏళ్ల నుంచి ఈ ప్రాంత ప్రజలు ఇసుకను తీయడంతో ఆలయం బయటపడినట్టు పూర్వీకులు చెబుతారు. ప్రస్తుతం ఇక్కడి ఆలయంలో ప్రతిష్ఠించబడ్డ శివలింగాలు కొన్ని బయటకు కనిపిస్తుండగా, మరికొన్ని భూగర్భంలో ఉన్నాయని పేర్కొంటున్నారు.,


ఆలయంలోని శివలింగం

### పోలీసు బందోబస్తు.. గజ ఈతగాళ్ల ఏర్పాటు

మహా శివరాత్రి పర్వదినాన సోమేశ్వరాలయానికి భారీ ఎత్తున భక్తులు తరలిరానున్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ ఎత్తున పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. సౌత్ ఏసీపీ పర్యవేక్షణలో సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లతో బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. అంతేకాక సముద్ర స్నానాలకు వెళ్లే భక్తుల రక్షణార్థం ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను కూడా రంగంలోకి దింపుతున్నారు.


అప్పికొండ సోమేశ్వరస్వామి శివాలయ

### వాహనాలకు ప్రత్యేక పార్కింగ్..

అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల వాహనాలను శివాలయానికి కిలోమీటరు దూరంలోనే నిలిపివేసేలా పార్కింగ్ స్థలాన్ని కూడా సిద్ధం చేస్తున్నారు. ఎటువంటి వాహనాలను ఆలయం వరకు అనుమతించే అవకాశం లేకపోవడంతో ట్రాఫిక్‌పరంగా ఎటువంటి సమస్యలు తలెత్తవని పోలీస్ అధికారులు భావిస్తున్నారు. అలాగే భక్తులకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నారు. పూర్తి స్థాయిలో తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు ఇతర ఏర్పాట్లను మూడు రోజులుగా జీవీఎంసీ అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అంతేకాక సోమేశ్వరాలయానికి భక్తులు చేరుకునేందుకు గాను ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. అనకాపల్లి, విశాఖ నగరంతో పాటు గాజువాక, స్టీల్ సిటీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## తీరంలో పురాతన దేవాలయం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రుషికొండ తీరంలో అతిపురాతన శివాలయం సప్తరుషీశ్వరాలయం. ఈ ఆలయం వద్ద ఉన్న సప్త బావుల్లో సప్తరుషులు స్నానమాచరించి శివారాధన చేసేవారని ప్రతీతి. ఈ బావులు సముద్రానికి అతి సమీపంలో ఉన్నప్పటికీ తియ్యనైన నీటితో నిండి ఉంటాయి. ఈ ఆలయంలో ఏటా మూడు రోజుల పాటు శివరాత్రి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది 25న గణపతి పూజతో ప్రారంభమై 27 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గురువారం శివపార్వతుల కల్యాణంతో ఉత్సవాలు ముగుస్తాయి. కాగా మంగళవారం నుంచి గణపతి హోమం, రుద్రహోమాలు, చండీహోమాలు, బుధవారం శివరాత్రి సందర్భంగా రుద్రాభిషేకాలు, దక్షిణావృతశంఖాలతో అభిషేకాలు, స్వామివారికి అన్నార్చన నిర్వహిస్తారు. లింగోద్భవ కాలంలో భక్తులకు స్వామివారి గర్భగుడి ప్రవేశం కల్పిస్తారు. శివపార్వతుల కల్యాణం, ఉత్సవ మూర్తుల ఊరేగింపు, పవళింపు సేవలను గురువారం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త సిద్ధార్థ తెలిపారు.


రుషికొండ తీరంలోని పురాతన శివాలయం


ఆలయంలో సప్త రుషులు స్నానం చేసిన బావులు

## క్రైం... crime news

### బంగారం దుకాణంలో దంపతుల చేతివాటం

ఎం.వి.పి.కాలనీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉంగరం కొనుగోలు చేయడానికి వచ్చిన దంపతులు చేతివాటంతో ఓ ఉంగరాన్ని తస్కరించి జారుకున్నారు. కాసేపటి తర్వాత చూసుకున్న దుకాణం సిబ్బంది పోలీసులను ఆశ్రయించారు. వివిధ సాంకేతిక కారణాలతో కేసు తాజాగా నమోదు చేశారు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని ఎస్ ఆర్ ఎస్ జ్యువెలర్స్‌లో డిసెంబరు 7న ఒక జంట బంగారు ఉంగరం కొనడానికి వచ్చి, వివిధ ఉంగరాలను పరిశీలించి, నచ్చలేదని వెళ్లిపోయింది. కొంత సేపటి తర్వాత ఉంగరం పోయినట్టు తెలుసుకున్న సిబ్బంది సీసీ కెమెరాల్లో పరిశీలించగా, సేల్స్‌మన్‌ను మాటల్లో పెట్టి ఒక ఉంగరం తస్కరించినట్టు గుర్తించిన దుకాణ యజమానులు పోలీసులను ఆశ్రయించారు. నిందితుల ఆచూకీ తెలుసుకున్న తర్వాత పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఉంగరం విలువ రూ.8 వేలు కావడంతో ముందుగా ఫిర్యాదును నమోదు చేయలేదని సమాచారం.

### నకిలీ హాల్ టికెట్లు మంజూరుపై కేసు నమోదు

'వైబ్రంట్ అకాడమీ' నిర్వాహకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నకిలీ హాల్ టికెట్లు మంజూరు చేయడంపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూర్మన్నపాలేనికి చెందిన పార్వతీ బిసాయ్, కనక బిసాయ్, మామిడిపాక సులోచనలు తమ పిల్లలైన గణేశ్ బిసాయ్, జీవన్ బిసాయ్, మామిడిపాక పవన్‌లను ఇక్కడి వైబ్రంట్ అకాడమీ (ప్రైవేటు విద్యాసంస్థ)లో 11, 12 తరగతులకు 2023-25 విద్యా సంవత్సరానికి గాను సీబీఎస్ఈ సిలబస్‌లో చేర్పించారు. ఇందుకోసం ఒక్కొక్కరు రూ.లక్షా పాతిక వేల చొప్పున చెల్లించారు. అయితే కొద్దిరోజులకే అకాడమీకి సీబీఎస్ఈ సిలబస్ బోధనకు అనుమతులు లేవని తెలియటంతో తల్లిదండ్రులు సంబంధిత నిర్వాహకులను నిలదీశారు. దీంతో వారు మరో కళాశాల ద్వారా పిల్లలతో పరీక్షలు రాయిస్తామని నమ్మబలికారు. అయితే పరీక్షలు దగ్గరపడడంతో తల్లిదండ్రులు నిర్వాహకులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో వారు విద్యార్థులకు మూడు రోజుల క్రితం ఫేక్ హాల్ టికెట్లు ఇచ్చారు. వాటిని స్కాన్ చేయగా ఇతర విద్యార్థుల వివరాలు కనిపించడంతో తల్లిదండ్రులు అకాడమీ నిర్వాహకులను నిలదీశారు. వారి వద్ద నుంచి సరైన సమాధానం రాకపోవడంతో తాము మోసపోయామంటూ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. నిర్వాహకులను పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్తుపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పరీక్షలు రాసేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసుస్టేషన్ పరిధి తాటిచెట్లపాలెం వెంకటేశ్వర కాలనీకి చెందిన ఓ వ్యక్తి అప్పుల బాధ తాళలేక ఈ నెల 22న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు అతనిని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. వెంకటేశ్వర కాలనీకి చెందిన పి.సింహాద్రి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. ఆర్థిక పరిస్థితులు బాగులేక కొంత మంది వద్ద అప్పు చేశాడు. వాటిని తీర్చలేక ఈ నెల 22న పురుగల మందు తాగాడు. తన ఆటోలో మధురానగర్‌కి వచ్చి స్పృహ కోల్పోయాడు. స్థానికుల సహాయంతో సింహాద్రిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా సీఐ రమణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి

» అధికారులకు కలెక్టర్ ఆదేశం

మహారాణిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలను గుర్తించి, వారి అభిప్రాయాన్ని గౌరవిస్తూ ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ హితవు పలికారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తున్న ఫిర్యాదులు, అధికారులు తీసుకుంటున్న చర్యలపై సోమవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై అనుసరించాల్సిన విధానంపై అధికారులకు దిశానిర్దేశం చేస్తూ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చే వినతులకు అధికారులు ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. అర్జీలు ఎట్టి పరిస్థితుల్లో రెండోసారి ఇచ్చే అవకాశం ఇవ్వొద్దని స్పష్టంచేశారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంలో భాగంగా రూపొందించిన జిల్లా అభివృద్ధి ప్రణాళిక-2029 రూపకల్పనపై అధికారులు దృష్టి సారించాలన్నారు. పది ప్రామాణిక సూత్రాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని అమలు పరచాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీ శంకర్ , ఏడీసీపీ రాజ్‌కమల్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### కొనసా..గుతున్న అప్పన్న ఆభరణాల తనిఖీలు

సింహాచలం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామికి భక్తులు సమర్పించిన స్వర్ణ, రజిత ఆభరణాలపై దేవదాయశాఖ కమిషనర్ నియమించిన జ్యూవెలరీ వెరిఫికేషన్ అధికారి తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి చెందిన ప్రభాకరాచారి అనే సీనియర్ జర్నలిస్టు అప్పన్న ఆభరణాల్లో కొన్ని మాయమయ్యాయని, మరికొన్ని తూనికల్లో లోపాలున్నాయని, కొన్నింటి స్థానంలో నకిలీవి ఉన్నాయంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ రీజనల్ జాయింట్ కమిషనర్ సుబ్బారావు ఆధ్వర్యంలో విచారణకు కమిషనర్ ఆదేశించారు. దీంతో దాదాపు నెల రోజుల క్రితం అప్పన్న ఆలయంలో ఆభరణాల తనిఖీలకు జేవీవో పల్లంరాజు శ్రీకారం చుట్టారు. తొలుత వారం రోజుల పాటు రికార్డులను సమగ్రంగా పరిశీలించడంతో పాటు జిల్లా ఖజానాలో, సింహాచలంలోని బ్యాంకులో ఉన్న నగలను పరిశీలిలించారు. ఆ తరువాత కొన్ని రోజులు తనిఖీలను నిలిపివేసి మళ్లీ నాలుగు రోజుల క్రితం ప్రారంభించారు. ప్రస్తుతం ఆలయ పద్మనిధిలో భద్రపరచిన హుండీల ద్వారా లభించిన రజిత ఆభరణాలను తనిఖీ చేయాల్సి ఉందని సోమవారం జేవీవో తెలిపారు. ఇప్పటివరకు జరిపిన తనిఖీల్లో ఎటువంటి లోపాలు లేవని గుర్తించామన్నారు. అయితే అర్చకులు, అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా మూడు రోజులుగా రజిత ఆభరణాలను తనిఖీ చేయడంలో జాప్యం చోటుచేసుకుంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఆలయ వస్తు ప్రదర్శనశాలలోని వస్తువుల పరిశీలనను ఆర్‌జేసీ సుబ్బారావు సమక్షంలో పూర్తి చేసి నివేదిక సిద్ధం చేస్తామన్నారు.


తనిఖీల్లో పాల్గొన్న జేవీవో పల్లంరాజు

## దీపం-2 పథకం అమల్లో ఫిర్యాదులు లేకుండా చూడండి

» జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బియ్యం కార్డుదారులకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పంపిణీకి కోసం ఉద్దేశించిన దీపం-2 పథకం అమలులో ఫిర్యాదులు లేకుండా చూడాలని గ్యాస్ ఏజెన్సీలు, పౌరసరఫరాలు, తూనికలు ,కొలతల శాఖ అధికారులకు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో దీపం-2 పథకం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆయన చర్చించారు. దీపం-2 కింద అర్హులైన గ్యాస్ వినియోగదారులకు సిలిండరు డెలివరీ అయిన 24 గంటల నుంచి 48 గంటల మధ్య సబ్సిడీ సొమ్ము జమవుతుందని గ్యాస్ డీలర్లు వివరించారు. అయితే సొమ్ము జమ అయిన బ్యాంకు/పోస్టాఫీస్ నుంచి సంబంధిత గ్యాస్ వినియోగదారుడికి అలర్ట్ మేసేజ్ వెళ్లడంలేదన్నారు. దీంతో కొందరు వినియోగదారులు తమను సంప్రదిస్తున్నారని వివరించారు. దీనిపై జేసీ స్పందిస్తూ, సిలిండర్ డెలివరీ అయిన 24గంటల నుంచి 48 గంటల మధ్య సబ్సిడీ సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్యాస్ సిలిండర్లను వినియోగదారుల ఇళ్లకు డెలివరీ చేసేటప్పుడు బాయ్స్ అదనపు సొమ్ము వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులను తీవ్రంగా పరిగణిస్తామన్నారు. దీనిపై డెలివరీ బాయ్స్‌కు ఏజెన్సీలు స్పష్టంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఒకవేళ వినియోగదారులు ఫిర్యాదుచేస్తే సంబంధిత గ్యాస్ ఏజెన్సీపై కేసు నమోదుచేస్తామని స్పష్టంచేశారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్‌వో కల్యాణి, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

## మానవాళికి సహనమే శ్రీరామ రక్ష

» మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు

మురళీనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సహనమే మానవాళికి శ్రీరామరక్షగా నిలుస్తుందని మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్క్‌లోని వేములపల్లి కళా ప్రాంగణంలో నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో ఆయన సోమవారం తన సందేశం అందించారు. ప్రస్తుతం అంతా వేగమే గొప్ప అనే భావనలో ఎటో పోతున్నారన్నారు. పెద్దా, చిన్న, హద్దుల్లో మెలిగినప్పుడే వసుధైక కుటుంబంగా శాంతిస్థాపన జరుగుతుందన్నారు. ప్రశాంత చిత్తానికి ఆధ్యాత్మికతే ఏకైక మార్గమని సూచించారు. ఈ కార్యక్రమంలో మురళీనగర్, కంచరపాలెం, మర్రిపాలెం తదితర ప్రాంత వాసులు, వైశాఖీ స్పోర్ట్సు పార్క్ ప్రముఖులు పాల్గొన్నారు. స్పోర్ట్సు పార్క్ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, కార్యదర్శి పెన్మత్స వెంకట సూర్యనారాయణ రాజు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు


గరికపాటికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పి.వెంకట సూర్యనారాయణరాజు, వరప్రసాద్ తదితరులు

## 'జీవీఎంసీ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి'


సమావేశంలో మాట్లాడుతున్న రొంగలి జగన్నాథం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కాంట్రాక్టర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మునిసిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రొంగలి జగన్నాథం కోరారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో సోమవారంనిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బకాయి ఉన్న రూ.400 కోట్లు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని జోన్లలో అభివృద్ధి పనులు చేస్తున్న చిన్న చిన్న కాంట్రాక్టర్లకు ఏళ్లుగా బిల్లులు చెల్లించకపోవడంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితినెలకొందన్నారు. వెంటనేప్రభుత్వం, మేయర్, ఇన్‌చార్జి కమిషనర్ స్పందించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.6 కోట్ల బకాయిలున్నాయన్నారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్‌కు, మేయర్‌కు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఫలితం దక్కలేదన్నారు. దీంతో కొంతమంది హైకోర్టుకు వెళ్లి ఆర్డర్లు తెచ్చుకుంటే వారికి బిల్లులు విడుదల చేశారన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు పీఎస్ ప్రసాద్, సీహెచ్ ప్రసాదరావు, బాదం సత్యనారాయణ, ఎంవీ సత్యనారాయణ, అంగా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### సింహగిరిలో శివరాత్రి పూజలు రేపు

సింహాచలం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సింహగిరి క్షేత్రపాలకుడు బాలాత్రిపుర సుందరి సహిత త్రిపురాంతకస్వామి దేవళంలో ఈనెల 26న మహాశివరాత్రి పూజలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఉత్సవంలో భాగంగా బుధవారం ఉదయం 6 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయన్నారు. రాత్రి 10.30 గంటలకు మహారుద్రాభిషేకం, లింగోద్భవ సమయంలో ప్రత్యేక అభిషేకాలు చేస్తారన్నారు.

### పంచగ్రామాల భూ ఆక్రమణలపై రీసర్వే ప్రారంభం

సింహాచలం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న పంచగ్రామాల భూ ఆక్రమణలపై రీసర్వే మళ్లీ ప్రారంభమైంది. ఎన్నికల హామీలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పంచగ్రామాల భూ వివాదానికి పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. 2008 సర్వే ఆధారంగా 12,149 ఆక్రమణలను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు అనుగుణంగా నాటి సర్వే మేరకు స్థితిని నిర్ధారించుకునేందుకు రీసర్వే చేయాలని ఇక్కడి దేవస్థానం అధికారులను దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశించారు. దానికి అనుబంధంగా ఈఓ వేంద్ర త్రినాథరావు, అధికారులతో కూడిన మూడు బృందాలు పంచగ్రామాల్లో పర్యటనకు శ్రీకారం చుట్టాయి. ప్రస్తుత రీ సర్వేలో 2008 లిస్టులో ఉన్న యజమానులు ఉన్నారా లేదా ఆక్రమణల్లో కొత్తగా ఎవరైనా చేరారా, జాబితాలోని వ్యక్తులు స్థలాలను విక్రయించారి వంటి విషయాలపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించడమే రీ సర్వే ప్రధాన లక్ష్యమని ఈఓ వివరించారు.



## గ్రీన్‌బెల్ట్‌లో దుకాణాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


దుకాణాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది


దుకాణాలు తొలగించడంతో తరలిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం బస్టాపు వెనుక గ్రీన్‌బెల్ట్‌ను ఆనుకొని ఏర్పాటు చేసిన దుకాణాలను సోమవారం పోలీసుల సాయంతో జీవీఎంసీ అధికారులు తొలగించారు. పోర్టు స్టేడియం నుంచి ఈ మార్గంలో చాలామంది నరసింహనగర్ రైతుబజారు వైపు వెళతారు. ఇక్కడే ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల ఉంది. అక్కడ చదువుకునే వేలాది మంది విద్యార్థులకు అనువుగా ఉంటుందనే కారణంతో ఇక్కడ రకరకాల వ్యాపారాలను ప్రారంభించారు. గ్రీన్‌బెల్ట్‌ను ఆనుకొని ఎవరికి వారు దుకాణాలు పెట్టేసుకున్నారు. టీ స్టాల్ నుంచి రెడీమేడ్ దుస్తులు, చేపల దుకాణాలు, చికెన్ షాపులు ఏర్పాటు చేశారు. వీటిని కొనుగోలు చేయడానికి వచ్చే వారు రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం విద్యార్థుల కోసం వచ్చే ఆటోలు, కార్లతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. వాహన చోదకులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సి వస్తోంది. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి' ఫొటోలతో కథనం ప్రచురించగా రెండు వారాల తరువాత జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, పోలీసు అధికారులు స్పందించారు. దుకాణాల తొలగింపు చర్యలు చేపట్టారు. అయితే ఈ మార్గంలో కొన్నింటినే తొలగించారని, ఇంకా కొన్ని ఉన్నాయని, వాటిని కూడా పూర్తిగా తీసివేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈసారి మళ్లీ ఆక్రమణలకు తెగబడకుండా టౌన్ ప్లానింగ్ సిబ్బంది జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.